
Happy Birthday
పుట్టినరోజు శుభాకాంక్షలు
జన్మదిన శుభాకాంక్షలు
Adhitya Vardhan Goud
6 ఆగస్టు
"నీ ప్రతి అడుగు విజయం వైపు కావాలి...
నీ భవిష్యత్తు ప్రకాశవంతంగా ఉండాలి...
ఆయురారోగ్యాలతో, అష్టసంపదలతో
ఎప్పుడూ సంతోషంగా ఉండాలి"
ఇట్లు
కుటుంబ సభ్యులు మరియు శ్రేయోభిలాషులు

తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన ప్రతిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
గురువారం
06 ఆగస్టు 2026
సంపుటి 03
సంచిక 297
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com


## అన్ని సేవలకు ఒకే నంబర్.. డయల్ --112




- ఏఐతో మరింత వేగంగా.. డయల్--112
- తెలంగాణలో నూతన తరం ఎమర్జెన్సీ రెస్పాన్స్ సిస్టమ్ ప్రారంభం
- 69 సెకన్లకే కాల్ స్వీకరణ.. 64 సెకన్లలో డిస్పాచ్
- 1,860 పెట్రోలింగ్ వాహనాల అనుసంధానం
- తెలంగాణ పోలీసుల అత్యవసర సేవలకు సాంకేతిక నవీకరణ
- అత్యవసర సేవల్లో దేశానికి ఆదర్శంగా తెలంగాణ

హైదరాబాద్, ఆగస్టు 5 (తరంగాలు ప్రతినిధి): అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు మరింత వేగంగా, సమర్థవంతంగా సేవలు అందించేందుకు తెలంగాణ పోలీసు శాఖ ఏఐ ఆధారిత నూతన తరం తెలంగాణ ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్ (టీజీ--ఈఆర్ఎస్ఎస్) డయల్--112ను

➤ మిగతా 2వ పేజిలో..



- 22 మంది చిన్నారుల మృతి.. ఏడుగురికి చికిత్స
- 35 మందికి వైరస్ నిర్ధారణ.. పలు జిల్లాల్లో కేసులు
- అరుదైన వైరస్‌పై ఆరోగ్య శాఖ అప్రమత్తం
- పిల్లల్లో లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచన

## గుజరాత్‌లో చండీపుర వైరస్ కలకలం

డెస్క్, ఆగస్టు 5 (తరంగాలు ప్రతినిధి) గుజరాత్‌లో చండీపుర వైరస్ వ్యాప్తి ఆందోళన కలిగిస్తోంది. ఈ వైరస్ బారినపడి ఇప్పటివరకు 22 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయినట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. ప్రస్తుతం మరో ఏడుగురు చిన్నారులు రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టగా, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. రాష్ట్రంలో నమోదైన 184 అనుమానిత కేసుల్లో 35 మందికి చండీపుర వైరస్ సోకినట్లు పరీక్షల్లో నిర్ధారణ అయిందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ప్రఫుల్ పన్సేరియా తెలిపారు. మరో 11 మంది నమూనాల పరీక్షా ఫలితాలు రావాల్సి ఉన్నాయని వెల్లడించారు. గాంధీనగర్, సబర్‌కాంత--హిమ్మత్‌నగర్, పటాన్, రాజ్‌కోట్, భావ్‌నగర్ ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న చిన్నారులకు నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ప్రత్యేక వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు ఆరుగురు చిన్నారులు కోలుకుని ఆసుపత్రుల నుంచి డిశ్చార్జ్ అయినట్లు వివరించారు.

చండీపుర వైరస్ నిర్ధారణ అయిన వారంతా 15 ఏళ్లలోపు చిన్నారులేనని మంత్రి తెలిపారు. ఈ వైరస్ ఒకే గ్రామం లేదా జిల్లాకు పరిమితం కాలేదని, గుజరాత్‌లోని పలు ప్రాంతాల నుంచి కేసులు నమోదవుతున్నాయని వెల్లడించారు. దీంతో వైరస్ వ్యాప్తిని కట్టడి చేసేందుకు వైద్య, ఆరోగ్య శాఖ బృందాలు క్షేత్రస్థాయిలో నిఘా పెంచాయని, దోమలు, ఇసుక ఈగల నివారణ కోసం విస్తృతంగా పురుగుమందులు పిచికారీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మి భయాందోళనలకు గురికావద్దని ఆరోగ్య శాఖ సూచించింది. పిల్లల్లో అధిక జ్వరం, వాంతులు, మూర్ఛ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా సమీప ఆసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. ప్రారంభ దశలోనే వైద్య చికిత్స అందితే ప్రాణాపాయం తగ్గే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు.

చండీపుర ఎన్సెఫలైటిస్ ఒక అరుదైన వైరల్ వ్యాధి. ఇది ప్రధానంగా ఇసుక ఈగల ద్వారా వ్యాపించి మెదడులో వాపుకు కారణమవుతుంది. ఈ వైరస్‌ను 1965లో మహారాష్ట్రలోని నాగ్‌పూర్ జిల్లా చండీపుర గ్రామంలో తొలిసారిగా గుర్తించారు. ముఖ్యంగా 15 ఏళ్లలోపు పిల్లలపై ఈ వైరస్ తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. సకాలంలో చికిత్స అందకపోతే పరిస్థితి వేగంగా విషమించే ప్రమాదం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం చండీపుర వైరస్‌కు ప్రత్యేక టీకా లేదా నిర్దిష్ట యాంటీవైరల్

➤ మిగతా 2వ పేజిలో..

## తెలంగాణ నీటి వాటా తగ్గిస్తే ఊరుకోం

- ప్రాజెక్టుల అనుమతుల రద్దు యత్నాలపై హరీశ్ రావు మండిపాటు



- రైతుల ప్రయోజనాల కోసం ప్రతి చర్య తీసుకుంటామని వెల్లడి
- అనుమతుల రద్దు కోరడం రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం
- తెలంగాణ ప్రయోజనాలను కాపాడేందుకు పోరాడుతాం
- తెలంగాణ ప్రాజెక్టులపై చంద్రబాబు లేఖను తప్పుబట్టిన హరీశ్ రావు

హైదరాబాద్, ఆగస్టు 5 (తరంగాలు ప్రతినిధి): గోదావరి నదిపై తెలంగాణ చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులను ఎప్పుడూ అడ్డుకోలేదంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న ప్రచారం వాస్తవాలకు విరుద్ధమని

➤ మిగతా 2వ పేజిలో..



## సాగునీటి ప్రాజెక్టులపై సీఎం విజ్ఞప్తి

- కేంద్ర పర్యావరణ మంత్రిని కలిసిన సీఎం రేవంత్ రెడ్డి
- పాలమూరు, గౌరవెల్లి, సీతమ్మ సాగర్, డిండి ప్రాజెక్టులపై విజ్ఞప్తి
- సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో త్వరితగతిన అనుమతులు కోరిన రాష్ట్రం
- జాప్యంతో ప్రాజెక్టుల వ్యయం పెరుగుతోందని కేంద్రానికి వివరణ

➤ 2వ పేజిలో..



## తెలంగాణ నీటి హక్కులపై రాజీ లేదు

- ప్రాజెక్టులపై తప్పుడు ప్రచారం మానుకోవాలి
- సమ్మక్క సాగర్‌కు నెలాఖరులో ఎన్‌ఓసీ వస్తుంది
- బీఆర్ఎస్ హయాంలోనే పోలవరం--బనకచర్ల ముందుకు..
- కాళేశ్వరం అవినీతిపై హరీశ్‌రావు సమాధానం చెప్పాలి
- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 5 (తరంగాలు ప్రతినిధి): తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులు, నీటి హక్కుల విషయంలో బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్

➤ మిగతా 2వ పేజిలో..



## తుమ్మిడిహెట్టికి అనుమతులివ్వండి..!

- జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరిన సీఎం రేవంత్‌రెడ్డి
- తెలంగాణ--మహారాష్ట్ర సమావేశం త్వరగా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి
- బ్యారేజీ ఎత్తు పెంపునకు మహారాష్ట్రను ఒప్పించాలని కేంద్రానికి వినతి
- అధికారుల స్థాయిలో చర్చలు ప్రారంభిస్తామని మంత్రి హామీ

న్యూఢిల్లీ, ఆగస్టు 5 (తరంగాలు ప్రతినిధి): ప్రాణహిత నదిపై ప్రతిపాదిత తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి అవసరమైన అనుమతులు త్వరగా ఇప్పించడంతో పాటు బ్యారేజీ ఎత్తు పెంపునకు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని

➤ మిగతా 2వ పేజిలో..

## విశాఖ ఎకనామిక్ రీజియన్‌కు రూ.9.50 లక్షల కోట్ల లక్ష్యం



- విశాఖ అభివృద్ధి ప్రణాళికలపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ప్రభుత్వ, ప్రైవేట్ పెట్టుబడులతో ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే కార్యాచరణ
- పోర్టులు, ఏఐ డేటా సెంటర్లు, క్లీన్ ఎనర్జీకి పెద్దపీట
- సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు

అమరావతి, ఆగస్టు 5 : విశాఖ ఎకనామిక్ రీజియన్‌ను దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక ప్రాంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను

➤ మిగతా 2వ పేజిలో..

## రైతులను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోంది: జగన్

- దేవరపల్లిలో పొగాకు రైతులతో మాజీ ముఖ్యమంత్రి భేటీ
- గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్న



ఆరోపణ
- వ్యాపారులతో కుమ్మక్కై రైతులను దగా చేస్తున్నారని విమర్శ
- రైతు సంక్షేమ పథకాలను రద్దు చేశారని ప్రభుత్వంపై మండిపాటు

➤ మిగతా 2వ పేజిలో..

## గుజరాత్‌లో చండీపుర వైరస్ కలకలం

ఔషధం అందుబాటులో లేదు. అందువల్ల లక్షణాలను బట్టి సహాయక చికిత్సే ప్రధాన మార్గంగా వైద్యులు పేర్కొంటున్నారు. వైరస్ వ్యాప్తిని నియంత్రించేందుకు పరిసరాల పరిశుభ్రత, ఇసుక ఈగల నియంత్రణ, పిల్లలను కీటకాల కాట్ల నుంచి రక్షించడం, అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించడం వంటి జాగ్రత్తలు పాటించాలని ఆరోగ్య శాఖ ప్రజలకు సూచించింది.

## తెలంగాణ నీటి హక్కులపై రాజీ లేదు

కుమార్ రెడ్డి మండిపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని స్పష్టం చేశారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గత 12 ఏళ్లుగా ప్రతి జలమండలి సమావేశంలో తెలంగాణ ప్రాజెక్టులపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తోందని మంత్రి తెలిపారు. వాటిని సమర్థవంతంగా తిప్పికొడుతూ తెలంగాణ ప్రయోజనాలను కాపాడుతున్నామని పేర్కొన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకానికి టెక్నికల్ అడ్వైజరీ కమిటీ అనుమతులు సాధించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో పలుమార్లు చర్చలు జరిపామని ఉత్తమ్ తెలిపారు. ఇప్పటికే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని మూడుసార్లు కలిసి విజ్ఞప్తి చేశామని, ఈ నెలాఖరులో ఎన్‌ఓసీ ఇస్తామని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని వెల్లడించారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ఇలాంటి ప్రయత్నం ఎందుకు చేయలేదని ప్రశ్నించారు.బీఆర్‌ఎస్ తొమ్మిదిన్నరేళ్ల పాలనలోనే రాయలసీమ ఎత్తిపోతల పథకం, పోలవరం--బనకచర్ల ప్రాజెక్టు పనులు ముందుకు సాగాయని మంత్రి ఆరోపించారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం కూడా అప్పుడే పూర్తయిందన్నారు. అధికారాన్ని కోల్పోయిన తర్వాత బీఆర్‌ఎస్ నేతలు మొసలి కన్నీరు కారుస్తూ విమర్శలు చేయడం సరికాదని వ్యాఖ్యానించారు.పోలవరం--బనకచర్ల ప్రతిపాదన వెలుగులోకి వచ్చిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం కేంద్రం, జలశక్తి మంత్రిత్వ శాఖ, కేంద్ర జల సంఘం, జలమండళ్లతో పలుమార్లు సమావేశమై తెలంగాణ అభ్యంతరాలను బలంగా వినిపించిందని ఉత్తమ్ తెలిపారు. ఈ అంశంపై సుప్రీంకోర్టులో ప్రధాన వ్యాజ్యంతో పాటు మధ్యంతర దరఖాస్తులు కూడా దాఖలు చేశామని చెప్పారు.కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి ఆరోపణలపై ముందుగా హరీశ్‌రావు సమాధానం చెప్పాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో భారీ వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు దెబ్బతినడానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు.తెలంగాణ ప్రజల నీటి హక్కులను కాపాడటం, సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన అనుమతులు సాధించడం, రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించడం కోసం ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

## తెలంగాణ నీటి వాటా తగ్గిస్తే ఊరుకోం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. తమ్మిడిహట్టి, సమ్మక్క సాగర్, సీతమ్మ సాగర్ ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గోదావరి నది నిర్వహణ మండలి (జీఆర్‌ఎంబీ)కి లేఖ రాశారని ఆయన విమర్శించారు.తెలంగాణకు అత్యంత కీలకమైన సాగునీటి ప్రాజెక్టుల విషయంలో కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకొని రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని హరీశ్ రావు ఆరోపించారు. తెలంగాణకు రావాల్సిన గోదావరి నీటి వాటాను తగ్గించే ఎలాంటి చర్యలనూ ప్రజలు సహించరని స్పష్టం చేశారు.తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో నీటి హక్కుల కోసం ప్రజలు ఎన్నో పోరాటాలు చేశారని హరీశ్ రావు గుర్తు చేశారు. ఆ ఉద్యమాల ఫలితంగా సాధించుకున్న హక్కులను పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. గోదావరి జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగితే మౌనంగా ఉండే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.రైతుల ప్రయోజనాలు, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రానికి దక్కాల్సిన నీటి హక్కులను కాపాడేందుకు అవసరమైన ప్రతి చర్య తీసుకుంటామని తెలిపారు. గోదావరి జలాల వినియోగంలో తెలంగాణ హక్కుల పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని తేల్చిచెప్పారు.తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగించే చర్యలను ప్రజల సహకారంతో సమర్థంగా ఎదుర్కొంటామని హరీశ్ రావు పేర్కొన్నారు. రాష్ట్ర హక్కులను కాపాడేందుకు రాజకీయాలకు అతీతంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.అయితే హరీశ్ రావు చేసిన ఆరోపణలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లేదా సంబంధిత అధికారుల నుంచి అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది. ఈ వ్యవహారం అంతర్రాష్ట్ర జల వివాదాలకు సంబంధించిన నేపథ్యంలో గోదావరి నది నిర్వహణ మండలి, కేంద్ర జల వనరుల శాఖ తదితర సంస్థల నిర్ణయాలు కీలకంగా మారనున్నాయి.

## విశాఖ ఎకనామిక్ రీజియన్‌కు రూ.9.50 లక్షల కోట్ల లక్ష్యం

సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. బుధవారం విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో సీఎం పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రాంతంలోని ప్రతి జిల్లాను పారిశ్రామిక, ఆర్థిక, పర్యాటక, మౌలిక సదుపాయాల పరంగా సమానంగా అభివృద్ధి చేసేలా దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. విశాఖ ఎకనామిక్ రీజియన్‌లో వివిధ రంగాలకు చెందిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల ద్వారా మొత్తం రూ.9.50 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందులో ప్రభుత్వ రంగం ద్వారా రూ.3.50 లక్షల కోట్ల పెట్టుబడులు, ప్రైవేట్ రంగం ద్వారా రూ.5.50 లక్షల కోట్ల పెట్టుబడులు సమీకరించేలా స్పష్టమైన రోడ్‌మ్యాప్ సిద్ధం చేయాలని అధికారులను కోరారు. ప్రతి ప్రాజెక్టుకు గడువులు, అమలు విధానం, పెట్టుబడుల సమీకరణ వ్యూహాన్ని ముందుగానే ఖరారు చేయాలని సూచించారు.

భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కృత్రిమ మేధ ఆధారిత డేటా సెంటర్ల ఎకోసిస్టమ్‌ను విశాఖ ప్రాంతంలో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అదే విధంగా పోర్టు ఆధారిత పరిశ్రమలు, హైడ్రోజన్ ఉత్పత్తి, క్లీన్-టెక్ ఎనర్జీ, గ్రీన్ ఇండస్ట్రీస్, ఆధునిక తయారీ రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. దేశీయ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించేలా ప్రపంచ స్థాయి మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పర్యాటక రంగాన్ని కూడా విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధిలో ప్రధాన భాగంగా పరిగణించాలని సీఎం సూచించారు. సముద్రతీర ప్రాంతాల అభివృద్ధి, పర్యాటక కేంద్రాల ఆధునికీకరణ, రహదారులు, విమానాశ్రయాలు, పోర్టులు, రైల్వే అనుసంధానాన్ని బలోపేతం చేసి అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక వసతులు అభివృద్ధి చేయాలని ఆదేశించారు. మూలపేట పోర్టు నుంచి రాజమహేంద్రవరం అఖండ గోదావరి ప్రాజెక్టు వరకు అభివృద్ధి కార్యక్రమాలను వీఈఆర్‌లో భాగంగా తీసుకుని ముందుకు సాగాలని పేర్కొన్నారు.విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి వల్ల భారీ స్థాయిలో పరిశ్రమలు ఏర్పడి లక్షలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. పారిశ్రామికీకరణతో పాటు సేవారంగం, లాజిస్టిక్స్, సమాచార సాంకేతిక రంగాలు కూడా వేగంగా అభివృద్ధి చెందేలా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# అన్ని సేవలకు ఒకే నంబర్.. డయల్ --112

అందుబాటులోకి తీసుకొచ్చింది. హైదరాబాద్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో డీజీపీ సీవీ ఆనంద్ ఈ వ్యవస్థను ప్రారంభించారు.



### ఒకే నంబర్.. అన్ని అత్యవసర సేవలు

పోలీసు, అగ్నిమాపక, అంబులెన్స్, మహిళల భద్రత, బాలల రక్షణ, విపత్తు నిర్వహణ తదితర అత్యవసర సేవలను 112 ద్వారా సమన్వయం చేయనున్నారు. అత్యవసర సమయంలో ప్రజలకు డయల్--112 తొలి సంప్రదింపు కేంద్రంగా పనిచేస్తుందని డీజీపీ తెలిపారు.

### ఏఐతో కాల్స్‌కు ప్రాధాన్యత

నూతన వ్యవస్థలో డూప్లికేట్, అనవసర కాల్స్‌ను ఏఐ సాయంతో గుర్తించి వడపోస్తారు. అత్యవసరత ఆధారంగా ఘటనలకు ప్రాధాన్యత కేటాయించి, సంబంధిత శాఖలకు కాల్స్‌ను ఆటోమేటిక్‌గా మళ్లిస్తారు. ఫీల్డ్ సిబ్బందిని ఏఐ ఆధారంగా కేటాయించడంతో పాటు వాయిస్‌ను టెక్స్ట్‌గా మార్చడం, లొకేషన్ ఆధారిత సేవలు, అడ్వాన్స్‌డ్ లొకేషన్ సర్వీసెస్, గూగుల్ మ్యాప్స్ ద్వారా కాలర్ స్థానాన్ని గుర్తించే సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి.

### 30 శాతం వేగం పెరిగింది

కాల్ స్వీకరణ సమయం 100 సెకన్ల నుంచి 69 సెకన్లకు, డిస్పాచ్ సమయం 90 నుంచి 64 సెకన్లకు తగ్గింది. మొత్తం కాల్ ప్రాసెసింగ్ సమయం 190 నుంచి 133 సెకన్లకు చేరింది. దీంతో దాదాపు 30 శాతం మెరుగుదల నమోదైనట్లు అధికారులు తెలిపారు.

### 1,860 పెట్రోలింగ్ వాహనాలు అనుసంధానం

రాష్ట్రంలోని 31 పోలీసు యూనిట్లకు చెందిన 1,860 పెట్రోలింగ్ వాహనాలను టీజీ--ఈఆర్‌ఎస్‌ఎస్‌తో అనుసంధానించారు. దీంతో సంఘటనకు సమీపంలో ఉన్న వాహనాన్ని గుర్తించి వెంటనే అక్కడికి పంపే అవకాశం ఏర్పడింది.

### రోజుకు 18 వేల అత్యవసర కాల్స్

24 గంటలూ పనిచేసే టీజీ--ఈఆర్‌ఎస్‌ఎస్ కేంద్రంలో 164 మంది శిక్షణ పొందిన సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. రోజుకు సుమారు 14 లక్షల కాల్స్ ఐవీఆర్‌కు చేరుతుండగా, అందులో దాదాపు 18 వేల అత్యవసర కాల్స్ స్వీకరించి, సుమారు 7,500 ఘటనలను ఫీల్డ్ బృందాలకు పంపిస్తున్నారు.

### త్వరలో ఏఐ డ్రోన్లు

తదుపరి దశలో హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లలో ఏఐ ఆధారిత డ్రోన్లను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టనున్నట్లు డీజీపీ తెలిపారు. అగ్నిప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు, విపత్తులు, శాంతిభద్రతల సమస్యలు, గుంపుల నియంత్రణ, గాలింపు--రక్షణ చర్యల్లో డ్రోన్లు తొలి స్పందన దళాలుగా పనిచేయనున్నాయి.

## తుమ్మిడిహెట్టికి అనుమతులివ్వండి..!

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు. బుధవారం ఢిల్లీలో జల్‌శక్తి మంత్రి కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని వివరిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తాను రాసిన లేఖతో పాటు, దానిపై ప్రధానమంత్రి కార్యాలయం స్పందించి జల్‌శక్తి శాఖకు పంపిన లేఖను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ సాగునీటి అవసరాలను తీర్చడంలో తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు కీలకమని, అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.


గతంలో తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వాల మధ్య 148 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మాణానికి ఒప్పందం కుదిరిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. అనంతరం పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ (సీడబ్ల్యూపీఆర్‌ఎస్) నిర్వహించిన అధ్యయనంలో 148 మీటర్లు, 152 మీటర్ల ఎత్తుల్లో బ్యారేజీ నిర్మించినా ముంపు ప్రభావంలో పెద్దగా తేడా ఉండదని తేలిందని వివరించారు.ముంపులో సగం వరకు నదీగర్భంలోనే ఉంటుందని కేంద్ర మంత్రికి తెలిపారు. 148 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మిస్తే అవసరమైన స్థాయిలో గురుత్వాకర్షణ ఆధారంగా నీటి సరఫరా సాధ్యం కాదని, 150 నుంచి 152 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తే విద్యుత్ వినియోగం లేకుండానే గ్రావిటీ ద్వారా నీటిని సరఫరా చేసే అవకాశం ఉంటుందని సీఎం వివరించారు. తద్వారా సాగునీటి పంపిణీ మరింత సమర్థవంతంగా జరగడంతో పాటు విద్యుత్ వ్యయం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు.బ్యారేజీ ఎత్తు పెంపునకు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని, వీలైనంత త్వరగా తెలంగాణ--మహారాష్ట్ర రాష్ట్రాల మధ్య సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు.

తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వెనుకబడిన ప్రాంతాలకు సాగునీటి వసతి కల్పించడంతో పాటు వ్యవసాయాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని వివరించారు.ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ఈ అంశంపై లేఖ అందినట్లు కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ తెలిపారు. తొలుత కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ, మహారాష్ట్ర అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చల ప్రక్రియ ప్రారంభిస్తామని వెల్లడించారు. అనంతరం రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో ఎంపీలు మల్లు రవి, వేమ్ నరేందర్‌రెడ్డి, రామసహాయం రఘురాం రెడ్డి, పోరిక బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, అనిల్ యాదవ్, డాక్టర్ కడియం కావ్య, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, శాఖ ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి

- **జనగామ సమీపంలో విషాద ఘటన**
- **ఎదురుగా వచ్చిన కారును ఢీకొన్న ద్విచక్రవాహనం**
- **అక్కడికక్కడే మృతి చెందిన ధనుంజయ**
- **మృతదేహాన్ని ఆస్పత్రికి తరలింపు**

జనగామ, ఆగస్టు 5 : జనగామ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ ధనుంజయ మృతి చెందారు. జనగామ--కొమ్మల్ల మధ్య టోల్‌గేట్ సమీపంలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. సమాచారం ప్రకారం, ద్విచక్రవాహనంపై వెళ్తున్న కానిస్టేబుల్ ధనుంజయ ఎదురుగా వస్తున్న కారును ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం.ధనుంజయ ఇటీవల వరకు



పాలకుర్తి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించినట్లు తెలుస్తోంది. ఆయన ఆకస్మిక మృతితో పోలీసు శాఖలో విషాదం నెలకొంది. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## సాగునీటి ప్రాజెక్టులపై సీఎం విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఆగస్టు 5 పాలమూరు--రంగారెడ్డి, గౌరవెల్లి, సీతమ్మ సాగర్, డిండి సాగునీటి ప్రాజెక్టులకు తక్షణమే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌ను కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి పార్లమెంట్‌లో కేంద్ర మంత్రిని కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన సానుకూల తీర్పు నేపథ్యంలో పర్యావరణ అనుమతుల జారీకి ఎలాంటి అడ్డంకులు లేవని ముఖ్యమంత్రి వివరించారు. రైతుల ప్రయోజనాలు, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న అనుమతులను వెంటనే మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు.పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టుపై ఇప్పటికే రూ.36,437 కోట్లు, డిండి ఎత్తిపోతల పథకంపై రూ.3,187 కోట్లు, సీతమ్మ సాగర్ ప్రాజెక్టుపై రూ.1,835 కోట్లు, గౌరవెల్లి ప్రాజెక్టుపై రూ.1,350 కోట్ల మేర రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. అనుమతుల జాప్యం కారణంగా నిర్మాణ పనులు నిలిచిపోయి ప్రాజెక్టుల వ్యయం గణనీయంగా పెరుగుతోందని వివరించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు తాగునీటి అవసరాలు కూడా తీరుతాయని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగానికి ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్టులను ఆలస్యం చేయకుండా పర్యావరణ అనుమతులు జారీ చేసి పనులు పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.సుప్రీంకోర్టు తీర్పు అనంతరం ఏర్పడిన అనుకూల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. రాష్ట్రాభివృద్ధి, వ్యవసాయ రంగ ప్రగతికి ఈ ప్రాజెక్టులు అత్యంత కీలకమని సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, వేమ్ నరేందర్ రెడ్డి, డాక్టర్ మల్లు రవి, రామసహాయం రఘురాం రెడ్డి, పోరిక బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, డాక్టర్ కడియం కావ్య, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్‌తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రైతులను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోంది: జగన్

దేవరపల్లి, ఆగస్టు 5: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వ విధానాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, గిట్టుబాటు ధరలు లేక అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలో బుధవారం పర్యటించిన ఆయన పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వ్యవసాయం నుంచి సంక్షేమం వరకు అన్ని రంగాల్లో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. పొగాకు రైతుల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోందని జగన్ అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో కిలో పొగాకుకు సగటున రూ.289 ధర లభించేదని, కొంతమంది రైతులు రూ.365 వరకు కూడా పొందారని పేర్కొన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ధర రూ.236కు పడిపోయిందని, అదే సమయంలో సాగు ఖర్చులు గణనీయంగా పెరగడంతో రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని తెలిపారు. గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం రైతుల నుంచి కేవలం 21 శాతం పొగాకును మాత్రమే కొనుగోలు చేసిందని జగన్ ఆరోపించారు. మిగిలిన పంట కొనుగోలు విషయంలో వ్యాపారులు, సిండికేట్లతో కుమ్మక్కై రైతులను దగా చేస్తోందని విమర్శించారు. మార్కెట్‌లో రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉండగా, వారిని వ్యాపారుల దయాదాక్షిణ్యాలకే వదిలేసిందని అన్నారు. రైతుల కష్టాన్ని పట్టించుకునే పరిస్థితి ప్రభుత్వంలో కనిపించడం లేదని విమర్శించారు. గిట్టుబాటు ధరలు లేక తీవ్ర మనస్తాపానికి గురైన వెంకటేశ్వరరావు అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడని జగన్ పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ప్రభుత్వ ప్రతినిధులు ఎవరూ వెళ్లకపోవడం విచారకరమని అన్నారు. రైతుల ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే అండగా నిలవాలని డిమాండ్ చేశారు.తమ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సున్నా వడ్డీ రుణాలు, రైతు భరోసా కింద అదనపు ఆర్థిక సహాయం, ఉచిత పంటల బీమా వంటి పథకాలను కూటమి ప్రభుత్వం రద్దు చేసిందని జగన్ ఆరోపించారు. ఈ నిర్ణయాల వల్ల రైతులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రైతులకు భరోసా కల్పించే విధానాల కంటే సంక్షేమ పథకాల కోతలపైనే ప్రభుత్వం దృష్టి సారించిందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని జగన్ ఆరోపించారు.

## ఘనంగా కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి జన్మదిన వేడుకలు



**కేసముద్రం,మహబూబాబాదజిల్లా,ప్రతినిధి,ఆగస్టు. 05,తరంగాలు:**అనుక్షణం ప్రజాక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తూ, విశేష సేవలందిస్తున్న కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి,జన్మదిన వేడుకలు బుధవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో అత్యంత వైభవంగా జరిగాయి.కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు,ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని, సంజీవరెడ్డి చేత కేక్ కట్ చేయించి శు భాకాంక్షలు తెలియజేశారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని, ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు.?ఈ జన్మదిన వేడుకలలో మండల, గ్రామ స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు ప్రజాప్రతినిధులు విశేషంగా పాల్గొన్నారు.ప్రజాప్రతినిధులు నాయకులు మాజీ ఉపసర్పంచ్ బానోత్ వెంకన్న, జిల్లా ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ రావుల మురళి, బండారు దయాకర్, మాజీ ఉపసర్పంచ్ పోలేపాక నాగరాజు, మాజీ సర్పంచ్ ముదిగిరి సాంబయ్య, కౌన్సిలర్ తరాల వీరేష్,?మార్కెట్ కమిటీ డైరెక్టర్లు చిదూరాల వసంత రావు, ఎండి అయూబ్ ఖాన్.?పార్టీ ప్రతినిధులు సీనియర్ నాయకులు వోలం కృష్ణమూర్తి, కనుకుల రాంబాబు, బానోత్ బాధ్య, వల్లందస్ రవి, గ్రామ పార్టీ అధ్యక్షులు పోలేపల్లి వెంకట్ రెడ్డి, నూకల వెంకటేశ్వర్లు, మాజీ ఉపసర్పంచ్ రఫీ, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లం గణేష్ యాదవ్, సమ్మయ్య గౌడ్, ఎండి నవాజ్ అహ్మద్, తుంపిల వెంకన్న, మల్లారెడ్డి, శ్రీహరి, బాల.?కార్యకర్తలు అభిమానులు శ్రీరామ్ కిరణ్, ఎండి తాజోద్దీన్, ఎండి రషీద్ ఖాన్, ముజ్జు షేక్, కొల్లూరు శ్రీనివాస్, రాజులపాటి ఉప్పలయ్య, కళ్ళెం శ్రీనివాస్ రెడ్డి, బన్నిశెట్టి వెంకటేష్, తొడేటి దినేష్, ఉప్పునూతల శ్రీను, పని, కాత్రేవుల హరి కృష్ణ, ఎండి సమీర్, శశి, తరుణ్ మరియు ఇతర కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత

•ఎమ్మెల్యే కోరం కనకయ్య




**ఇల్లందు ప్రతినిధి ఆగస్టు 5,( తరంగాలు)** : ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడేందుకు రక్తదానం చేయడం ప్రతి ఒక్కరి నైతిక బాధ్యత అని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. రక్తదానం వల్ల ఎంతోమంది ప్రాణాలు నిలబడతాయని, ఇది గొప్ప సేవ అని పేర్కొన్నారు. బుధవారం ఇల్లందు ప్రభుత్వ ఆసుపత్రిలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్తదానం పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను వీడాలని సూచించారు. రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యానికి ఎటువంటి హాని జరగదని, పైగా కొత్త రక్తం ఉత్పత్తికి అవకాశం ఉంటుందని తెలిపారు.రోడ్డు ప్రమాదాలు, ప్రసవ సమయాలు, శస్త్రచికిత్సల సమయంలో రక్తం అవసరం ఎంతగానో ఉంటుంది. అటువంటి సమయంలో మనం చేసే ఒక రక్తదానం ముగ్గురి ప్రాణాలను కాపాడుతుంది. కాబట్టి ప్రతి యువకుడు సంవత్సరానికి కనీసం రెండుసార్లు రక్తదానం చేయాలని, రక్తదానం ద్వారా మరొకరికి జీవితాన్ని ఇచ్చినంత తృప్తి మరెందులోనూ ఉండదని, సమాజంలో ప్రతి ఒక్కరు రక్తదాతలుగా ముందుకు రావాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య పిలుపునిచ్చారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో చెట్ల మొక్కలను నాటడం జరిగింది.ఈ కార్యక్రమంలో డిఎస్పి వెంకన్నబాబు, సీఐ తాటిపాముల సురేష్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, ఆస్పత్రి సూపర్డెంట్ చంద్రశేఖర్, వైస్ చైర్మన్ పెండేల రాజు,పట్టణ అధ్యక్షుడు బోళ్ళ సూర్యం, కౌన్సిలర్లు కొర్లపాటి శివ కిరణ్, మెరుగు కార్తీక్, నీలపు రమేష్, చిల్లా విజయభారతి,నీరుడు ఉపేంద్ర, కోఆప్షన్ సభ్యులు మ డుగు సాంబమూర్తి, ఆస్పత్రి సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించిన ఎస్సై బి రామారావు

***జఫర్గడ్ , ఆగస్టు 6, (తరంగాలు)*** : సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జఫర్గడ్ ఎస్ఐ బి. రామారావు అన్నారు. మండల కేంద్రంలోని టి జి యస్ డబ్ల్యూ ఆర్ యస్ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ ద్వారానే 80 శాతం సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. పెరుగుతున్న సాంకేతికను ఆసరాగా చేసుకుని అక్రమార్కులు సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఫేస్బుక్,వాట్సప్ వాటిపై విద్యార్థులు అవగాహన పెంచుకుని ఇటువంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా జాగృతం చేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉపాధ్యాయులు పిల్లలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సైబర్ నేరాల కట్టడికి అప్రమత్తత,అవగాహనే ఆయుధం పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో** : సైబర్ నేరాల కట్టడికి అప్రమత్తత,అవగాహనే ఆయుధమని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించడానికి సైబర్ జాగృక్త దివస్ కార్యక్రమంలో భాగంగా సైబర్ క్రైమ్ పోలీసుల ఆధ్వర్యంలో ఈ రోజు 'సురక్ష కా తిరంగా –సైబర్ స్వతంత్ర తెలంగాణ' ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్

అనే ప్రత్యేక అవగాహన ప్రచార కార్యక్రమాన్ని నగరంలోని ఎస్ఆర్ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ...డిజిటల్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానం మానవ జీవితాన్ని అపూర్వంగా సులభతరం చేసినప్పటికీ, అదే సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ సైబర్ నేరగాళు ప్రజల సొమ్ము,వ్యక్తిగత సమాచారం,గోప్యతపై దాడులు చేయడం ఆందోళనకరంగా మారిందన్నారు. నగదులావాదేవీల స్థానంలో యూపీఐ, నెట్ బ్యాంకింగ్,మొబైల్ బ్యాంకింగ్,డిజిటల్వాలెట్లు, ఆన్లైన్ కొనుగోళ్లు, సామాజిక మాధ్యమాల వినియోగం విస్తరించడంతో సైబర్ నేరాలకు అవకాశాలు పెరిగాయని అన్నారు.

సైబర్ నేరాల నివారణలో ప్రతి పౌరుడు కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్, సీవీవీ సంఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు చెప్పకూడదన్నారు. తెలియని లింక్ లను నొక్కకూడదన్నారు. ప్రతి ఖాతాకు వేర్వేరు బలమైన సంకేత పదాలను ఉపయోగించాలన్నారు. రెండు దశల ధృవీకరణ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన సందేశాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని,అనుమానాస్పద కాల్ వస్తే వెంటనే కాల్ నిలిపివేసి సంబంధిత సంస్థ అధికారిక నంబర్లకు సంప్రదించాలన్నారు.ప్రస్తుతం కృత్రిమ మేధస్సు, నకిలీ వెబ్సైట్లు, నకిలీ మొబైల్ యాప్లు, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రకటనలు, ఉద్యోగాల పేరుతో మోసాలు, పెట్టుబడుల పేరుతో మోసాలు, డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరింపులు, ఓటీపీలు, యూపీఐ అభ్యర్థనలు, క్యూఆర్ కోడ్ల ద్వారా డబ్బు దోచుకునే కొత్త పద్ధతులు విస్తృతంగా పెరిగాయని, నేరగాళ్లు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంలో మరింత చురుకుగా మారుతుండగా, సాధారణ ప్రజలలో అవగాహన అంతే వేగంగా పెరగకపోవడం సమస్యను మరింత క్లిష్టతరం చేస్తోందన్నారు.

ప్రతి నెల వందల సంఖ్యలో సైబర్ మోసాలపై ఫిర్యాదులు నమోదవుతున్నాయని, లక్షల రూపాయల మేర ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. అత్యంత విద్యావంతులు కూడా నేరగాళ్ల మానసిక వ్యూహాలకు మోసపోవడం ఈ నేరాల స్వరూపాన్ని తెలియజేస్తోందని పేర్కొన్నారు. ఒక్కసారి బ్యాంకు వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్ లేదా వ్యక్తిగత సమాచారం నేరగాళ్ల చేతికి చేరితే కొన్ని నిమిషాల్లోనే బ్యాంకు ఖాతాలు ఖాళీ అవుతున్నాయని తెలిపారు.

ఇటీవలి కాలంలో ప్రమాదకరంగా మారిన నేరాల్లో 'డిజిటల్ అరెస్టు' మోసాలని, కేంద్ర దర్యాప్తు సంస్థలు, పోలీసు అధికారులు పేర్లు చెప్పి వీడియో కాల్ ద్వారా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ గంటల తరబడి ఫోన్లోనే ఉంచి వారి నుంచి లక్షల రూపాయలు బదిలీ చేయించుకునే సంఘటనలు వెలుగు చూశాయని,అలాగే పెట్టుబడి పెడితే రోజుల్లోనే రెట్టింపు లాభాలు వస్తాయని నమ్మిస్తూ నకిలీ ట్రేడింగ్ యాప్ల ద్వారా లక్షల రూపాయలు కాజేసే సంఘటనలు కూడా పెరుగుతున్నాయని అన్నారు.

తెలియని వ్యక్తుల నుంచి వచ్చిన లింక్లను తెరవడం, అపరిచిత యాప్లను డౌన్లోడ్ చేయడం, ఓటీపీలు చెప్పడం, క్యూఆర్ కోడ్లను విచక్షణారహితంగా స్కాన్ చేయడం, సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత వివరాలను అధికంగా పంచుకోవడం, ఒకే సంకేత పదాన్ని అన్ని ఖాతాలకు ఉపయోగించడం వంటి అలవాట్లు నేరగాళ్లకు అవకాశాలను కల్పిస్తున్నాయని తెలిపారు.

ఆన్లైన్ మోసాలు లేదా ఆర్థిక సైబర్ నేరాలు జరిగితే బాధితులు వెంటనే టోల్-ఫ్రీ నంబర్ 1930 కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని,ఇది 24 గంటలూ పనిచేస్తుందన్నారు.కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణిందర్, ఇన్స్పెక్టర్లు కరుణాకర్, బాలకృష్ణ, మోహన్ బాబు, భానుప్రకాష్, ఉస్మాన్ షరఫ్, రవికుమార్, ఎస్సై లు రంజిత్ కుమార్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

# తల్లిపాలు శిశువు ఆరోగ్యానికి తొలి రక్షణ





**జఫర్గడ్ ప్రతినిధి, ఆగస్టు 5,(తరంగాలు):** మండలం లోని హిమ్మత్ నగర్ అంగన్వాడీ కేంద్రం 3.లో తల్లీ పాల వారోత్సవాలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం లో సూపర్ వేజర్ టీ అనిత పాల్గొన్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ తల్లీ పాలు బిడ్డ కు ఎంతో బలం అని శిశువు పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని అవి పుట్టిన పాపకు ఎంతో బలం అని వారు అవగాహనా చేసారు. ఈ కార్యక్రమం లో ఐసీడీస్ సూపర్ వైజార్ టీ అనిత, అంగన్వాడీ టీచర్లు. శారదా,టీ రాజమణి, తల్లులు, పిల్లలు,గర్భిణీ లు, పిల్లలు,ఆయా లు నాగలక్ష్మి ఇ. వినోదతది,తరులు పాల్గొన్నారు.

# వేణు కుమార్కు మరోసారి మానవత్వం చాటుకొని అండగా నిలిచిన మాజీ ఎంపీ నామ



•వేణు కుమార్ డిశ్చార్జ్ బిల్లు మాఫీ

•క్లిష్ట సమయంలో మానవత్వం చాటుకున్న ప్రశాంతి హాస్పిటల్,డాక్టర్:భరత్ బాబు



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** గ్రూప్స్ నోటిఫికేషన్ల విడుదలలో జాప్యంపై ఆవేదన వ్యక్తం చేస్తూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ముదిగొండ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన జి.వేణు కుమార్ సోమవారం ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు మరోసారి మానవత్వాన్ని చాటుతూ ఆస్పత్రి యాజమాన్యంతో నేరుగా మాట్లాడి వేణు కుమార్ డిశ్చార్జ్ బిల్లును మాఫీ చేయించారు. ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రికి చేరిన వేణు కుమార్కు సకాలంలో వైద్య సేవలు అందించిన డాక్టర్ కేసోజు భరత్ బాబు, ఆస్పత్రి వైద్య బృందం,నర్సింగ్ సిబ్బందిని నామ అభినందించారు.ఇప్పటికే నామ ట్రస్ట్ తరపున వేణుకుమార్కు రూ.50 వేల ఆర్థిక సాయం అందించిన నామ వారి కుటుంబంపై ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు తెలిపారు. వేణు కుమార్ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన అనంతరం వేణు కుమార్,కుటుంబ సభ్యులు ఫోన్ ద్వారా నామకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వేణు కుమార్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న నామ, జీవితంలో ఇంకా ముందుకు వెళ్లాలని, సాధించాల్సింది చాలా ఉందని ధైర్యం చెప్పి భరోసా కల్పించారు. వేణు కుమార్ త్వరగా పూర్తిగా కోలుకుని సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించి , నిరుద్యోగ యువత ఎట్టి పరిస్థితుల్లోనూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని మరోసారి విజ్ఞప్తి చేశారు.

# భూ రీ-సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- జిల్లా కలెక్టర్ దివాకర్.టీఎస్
- రైతుల సమక్షంలోనే పారదర్శకంగా భూ రీ సర్వే నిర్వహిస్తాం
- రీ-సర్వే పూర్తయిన తర్వాత భవిష్యత్తులో భూ వివాదాలు గణనీయంగా తగ్గి రైతులకు భద్రత కలుగుతుంది



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో** : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ రీ-సర్వే ద్వారా రైతుల భూములపై ఉన్న వివాదాలు, విస్తీర్ణ వ్యత్యాసాలు, రికార్డులలోని లోపాలను పూర్తిగా పరిష్కరించి శాశ్వతమైన, పారదర్శకమైన భూ రికార్డులను రూపొందించేందుకు అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్పష్టం చేశారు. పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండలం కొంగర గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం భూ రీ-సర్వే పై నిర్వహించిన గ్రామ సభలో జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ పాల్గొని రైతులకు, గ్రామ ప్రజలకు సమగ్రంగా అవగాహన కల్పించారు. ప్రజలు భూ సర్వే పై అడిగిన పలు సందేహాలకు కలెక్టర్ నివృత్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ గ్రామంలో ముందుగా రెవెన్యూ గ్రామ సరిహద్దులను పూర్తిగా ఖరారు చేస్తున్నామని, అనంతరం ప్రభుత్వ భూములు, భూసేకరణ జరిగిన ప్రాంతాలు, ఇతర ప్రత్యేక భూములను గుర్తించి వేరు చేస్తున్నామని వివరించారు. తరువాత మాత్రమే వ్యవసాయ భూములు, రైతుల వ్యక్తిగత భూములను క్షేత్రస్థాయిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే చేస్తామని తెలిపారు. సర్వే ప్రక్రియను ఆధునిక యంత్రాల సహాయంతో పూర్తి స్థాయిలో కొలిచి సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు.గతంలో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు లేకపోవడం, అన్లైన్ ప్రక్రియలో పేర్లు నమోదు కాకపోవడం, రికార్డుల్లో ఉన్న విస్తీర్ణానికి భూమిపై ఉన్న విస్తీర్ణానికి తేడాలు ఉండడం వంటి అనేక సమస్యలు రైతులు ఎదుర్కొన్నారని తెలిపారు. కొంతమందికి తక్కువ విస్తీర్ణం నమోదు కాగా,మరికొందరికి ఎక్కువగా నమోదైన సందర్భాలు కూడా ఉన్నాయని, రీ-సర్వే ద్వారా అలాంటి అన్ని లోపాలను సరిచేస్తామని చెప్పారు.గ్రామంలోనీ ప్రతి రైతుకు 48గంటల ముందుగానే నోటీసులు జారీ చేసి, రైతుల సమక్షంలోనే వారి పొలాలను కొలుస్తామని కలెక్టర్ తెలిపారు. రైతులు స్వయంగా తమ భూమి హద్దులను చూపిస్తారని,పక్కనే ఉన్న రైతులను కూడా పిలిచి పంచనామా నిర్వహించి హద్దులను నిర్ధారిస్తామని వివరించారు. సర్వే పూర్తయ్యాక ఎంత విస్తీర్ణం నమోదైందో రైతులకు అక్కడికక్కడే తెలియజేస్తామని చెప్పారు.భూ రీ సర్వే మొత్తం ప్రక్రియ పూర్తిగా క్షేత్ర స్థాయిలో భూ హక్కుదారిని సమక్షంలో పారదర్శకంగా జరుగుతుందని, రైతుల హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.రైతులు అపోహలకు గురికాకుండా అధికారులు అందించే సమాచారాన్ని విశ్వసించి భూ రీ-సర్వే కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని కోరారు.కాకరవాయి, బేతుపల్లి గ్రామాల్లో రీ-సర్వే నిర్వహించిన సందర్భం గుర్తుచేస్తూ, అందుకే ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి పూర్తి వివరాలు తెలియజేస్తున్నామని చెప్పారు. సర్వే అనంతరం గ్రామాల్లో భూ వివరాలను ప్రకటించి 60 రోజుల గడువు ఇస్తామని,అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరించిన తర్వాత వివరాలను ఆన్లైన్లో నమోదు చేసి భూధార్ కార్డులు జారీ చేస్తామని పేర్కొన్నారు. రీ-సర్వే పూర్తయిన తర్వాత భవిష్యత్తులో భూ వివాదాలు గణనీయంగా తగ్గి రైతులకు శాశ్వత భద్రత కలుగుతుందని కలెక్టర్ దివాకర టీఎస్ స్పష్టం చేశారు. ఆనతరం నేలకొండపల్లి మండలం బుద్దారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వీఓ భవనం పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని ఆధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యాక్రమంలో నేలకొండపల్లి తహసీల్దారు రాంప్రసాద్, ఎంపిడివో ఎర్రయ్య, గ్రామ సర్పంచ్, సంబంధిత అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కేసముద్రం కళాశాలల్లో ముగిసిన విద్యార్థుల సంతకాల సేకరణ

- ముఖ్యమంత్రికి వినతిపత్రం పంపిన బీజేపీ, బిజెవైఎం శ్రేణులు



ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్

కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, ఆగస్టు.05, తరంగాలు:తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, భారతీయ జనతా యువ మోర్చా బిజెవైఎం పిలుపు మేరకు కేసముద్రం మండల కేంద్రంలో విస్తృత నిరసన కార్యక్రమాలు చేపట్టారు. "ఫీజుల బకాయి - బిజెపి లడాయి" నినాదంలో భాగంగా బిజెవైఎం మండల అధ్యక్షుడు భూక్య విజయ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో విద్యార్థినీ విద్యార్థుల నుంచి నిర్వహించిన బృహత్ సంతకాల సేకరణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.?ఈ కార్యక్రమానికి బీజేపీ కేసముద్రం మండల శాఖ అధ్యక్షుడు ఉప్పునూతుల రమేష్, మున్సిపల్ కన్వీనర్ బోగోజు నాగేశ్వర చారి ముఖ్య అతిథులుగా హాజరై తమ మద్దతు తెలిపారు.రాష్ట్రంలో విద్యావ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది"?ఈ సందర్భంగా బీజేపీ, బిజేవైఎం నాయకులు మాట్లాడుతూ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల రాష్ట్రంలో విద్యావ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని మండిపడ్డారు. నిధుల విడుదల లేకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

# ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకా

- ఏ సి డి పి ఓ కె.కమలాదేవి



కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,ఆగస్టు. 0 5,తరంగాలు:తల్లిపాల వారోత్సవాల్లలో భాగంగా బుధవారం ఉప్పరపల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రం లో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏ సి డి పి ఓ కె.కమలాదేవి ముర్రుపాల ప్రాముఖ్యత గురించి వివరించారు.తల్లిపాలు బిడ్డకు మొదటి టీకా అని,ఇది సంపూర్ణ ఆహారం అని తెలిపారు. బిడ్డ పుట్టిన గంటలోపు వెంటనే తల్లి పాలు ఇవ్వడం ప్రారంభించాలన్నారు.6 నెలలు తల్లి పాలు ఇవ్వడం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. శిశివు ఆరోగ్యాంగా ఎదుగుతుందని, అలాగే తల్లి ఆరోగ్యానికి కూడ అనేక ప్రయోజనాలు కలుగుతాయనీ ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు, మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమములో సూపెర్వైజర్ బి.జ్యోతి,పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు చంద్రశేఖర్, సర్పంచ్ సునీత కుమస్వామి. ఏ డబ్ల్యుటి కే.యశోద, పి. పద్మ.యం. సరిత,బి.సునీత మరియు ఆరోగ్య సిబ్బంది,వార్డు సభ్యులు తదితరులు హాజరయ్యారు.

# గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ కేసముద్రం డివిజన్ అధ్యక్షుడిగా వడ్లకొండ సుధాకర్ గౌడ్ నియామకం





**కేసముద్రం,మహబూబాబాద్జిల్లా, ప్రతినిధి,ఆగస్టు. 05,తరంగాలు**:గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకు దెబ్బ) కేసముద్రం డివిజన్ అధ్యక్షుడిగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ సమాజ సేవకులు వడ్లకొండ సుధాకర్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా మోకు దెబ్బ అధ్యక్షుడు ముంజాల రాజేందర్ గౌడ్, బుధవారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి మోకు దెబ్బ రాష్ట్ర కార్యదర్శి గడ్డం సమ్మయ్య గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.?గౌడ సమాజ బలోపేతానికి, ఐక్యతకు కృషి చేస్తా: వడ్లకొండ సుధాకర్ గౌడ్ ?తనపై నమ్మకంతో కేసముద్రం డివిజన్ అధ్యక్షుడిగా నియమించినందుకు మోకు దెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సా గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి గడ్డం సమ్మయ్య గౌడ్, జిల్లా అధ్యక్షుడు ముంజాల రాజేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బూడిగే భద్రసేన గౌడ్, గౌరవ సలహాదారు గడ్డం విజయ్‌లకు సుధాకర్ గౌడ్,ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ:?కేసముద్రం డివిజన్ పరిధిలోని అన్ని కమిటీలను త్వరలోనే పూర్తిస్థాయిలో నిర్మాణం చేస్తామని తెలిపారు.?గౌడ కులస్థుల సమస్యల పరిష్కారానికి, యువత విద్యాభివృద్ధికి నిరంతరం పోరాడతానని హామీ ఇచ్చారు.బహుజన ఐక్యతను చాటుతూ గౌడ సంఘ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు.?పాల్గొన్న నాయకులు ?ఈ కార్యక్రమంలో మోకు దెబ్బ జిల్లా అధ్యక్షుడు ముంజాల రాజేందర్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి గడ్డం సమ్మయ్య గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బూడిగే భద్రసేన గౌడ్, విగ్రహ కమిటీ అధ్యక్షుడు జెరిపోతుల వెంకన్న గౌడ్, ఉపాధ్యక్షుడు పెద్ది వెంకన్న గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గండి వీరేందర్ గౌడ్, అధికార ప్రతినిధి లింగాల వీరభద్రం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సిహెచ్. మదార్ గౌడ్
- ప్రభుత్వ జూనియర్ కళాశాల, నెల్లికుదురులో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

**నెల్లికుదురు,మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,ఆగస్టు. 05, తరంగాలు**:తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సిహెచ్. మదార్ గౌడ్ అన్నారు. బుధవారం ఆయన ప్రభుత్వ జూనియర్ కళాశాల, నెల్లికుదురును సందర్శించి విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందజేస్తున్న ఉచిత నోట్‌బుక్స్‌ను ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ విద్యా సామగ్రిని సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదివి ఉన్నత ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. నాణ్యమైన విద్యకు ప్రభుత్వ కళాశాలలే సరైన వేదికని పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, మెరుగైన బోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, స్కాలర్‌షిప్‌లు, ఇతర సంక్షేమ పథకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం కళాశాలలోని మౌలిక వసతులను పరిశీలించి, చేపట్టిన మైనర్ రిపేర్ పనులకు సంబంధించిన వివరాలను కళాశాల ప్రిన్సిపాల్ కె. వీరస్వామిని అడిగి తెలుసుకున్నారు. అవసరమైన మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె. వీరస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ కళాశాలల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులకు అందిస్తున్న నోట్‌బుక్స్ వారి విద్యాభ్యాసానికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# వ్యవసాయ కార్మికులకు ఘన నివాళి

**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్ సి ఆగస్టు 5 తరంగాలు**:తెలంగాణ వలిగొండ మండల పరిధిలోని మొగిలిపాక గ్రామానికి చెందిన వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు శ్యామల ముత్యాలు భార్య శ్యామల బుచ్చమ్మ అనారోగ్య కారణాలతో మరణించడం జరిగింది. వారి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా లాయర్ యూనియన్ ఐ లు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి,మండల కాంగ్రెస్ నాయకులు మామిడి సత్తిరెడ్డి,మాజీ సర్పంచ్ మొగిలిపాక గోపాల్, గ్రామశాఖ అధ్యక్షులు పబ్బు ఎల్లయ్య,సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి గుండెపురి నరసింహ,మొగిలిపాక పాపయ్య,పబ్బు నరసయ్య,మొగిలి పాక జాంగిర్,మరల నరసింహ,



శ్యామల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక
తరంగాలు

## వలిగొండ సబ్ ఇన్స్పెక్టర్ యుగేందర్ గౌడ్ బదిలీ వలిగొండ కొత్త సబ్ ఇన్స్పెక్టర్ గా ఏ. శ్రీకాంత్ రెడ్డి నియామకం



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి ఆగస్టు 5 తరంగాలు**

యాదాద్రి జోన్-5 పరిధిలో పోలీసు శాఖలో సబ్ ఇన్స్పెక్టర్ల బదిలీలు పోస్టింగులకు సంబంధించిన ఉత్తర్వులు జారీ అయ్యాయి. పరిపాలనా అవసరాలు, ప్రజాహితం దృష్ట్యా ఈ బదిలీలు తక్షణమే అమల్లోకి వస్తాయని డీఐజీ కార్యాలయం పేర్కొంది.ప్రస్తుతం వలిగొండ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్న వై. యుగేందర్ గౌడ్ ను వీఆర్, యాదాద్రి భువనగిరికి బదిలీ చేశారు.నల్గొండ జిల్లా వాడపల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఏ. శ్రీకాంత్ రెడ్డిని వలిగొండ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా నియమించారు.ఈ మేరకు నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల ఎస్పీలు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు

## అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు అందుతాయి ఎంపీడీవో



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి ఆగస్టు 5 తరంగాలు** వలిగొండ మండల కేంద్రంలో బుధవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి జలంధర్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాల అర్హతలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరాజు, హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్ కిరణ్‌లతో కలిసి గుడిసెవాసుల ఇళ్లను సందర్శించి వారి నివాస పరిస్థితులు, కుటుంబ వివరాలను పరిశీలించారు.ప్రభుత్వం నిర్దేశించిన అర్హత ప్రమాణాల మేరకు లబ్ధిదారులను గుర్తించి, వారి వివరాలను నమోదు చేశారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిజమైన అర్హులైన నిరుపేద కుటుంబాలకు గృహ నిర్మాణ ప్రయోజనాలు అందేలా క్షేత్రస్థాయిలో పారదర్శకంగా అర్హత పరిశీలన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జి. జలంధర్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు

## ఆగస్టు 10న జరిగే భరో కార్యక్రమంను జయప్రద0 చేయండి:- కోమటిరెడ్డి చంద్రారెడ్డి



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి ఆగస్టు 5 తరంగాలు**

కేంద్రం లో అధికారంలో ఉన్న బీ జే పీ ప్రభుత్వం కార్పొరేట్ ల కు అనుకులంగా కార్మిక , రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేస్తుందని, దీనికి వ్యతిరేకంగా నేడు కార్మికులు రైతు లు, వ్యవసాయకార్మికులు, ప్రజలు, క్విట్ ఇండియా స్ఫూర్తితో ఆగస్టు వదిన జరిగే జైల్ బరో కార్యక్రమంలో కార్మికులకు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి కార్మికులకు పిలుపునిచ్చారు.బుధవారం వలిగొండ వ్యవసాయ మార్కెట్లో ఆగస్టు పదిని జరిగే జైల్ బరో కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా చంద్ర రెడ్డి మాట్లాడుతూ :- బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారులకు వచ్చిన తర్వాత కార్మికుల శ్రమనుదోసే నాలుగు లేబర్ కోడ్ ల ను తీసుకురావడం జరిగింది . విద్యుత్ సవ రణ బిల్లు 2025,విత్తనాలచట్ట సవరణ తీసుకొచ్చారు సులుబతర వ్యాపారం పేరుతో పెట్టుబ డు దారులకు గరిష్ట లాభాలకొరకు కార్మిక చట్టా ల ను రద్దు చేసింది. రోజువారి పని దినాన్ని 8గంటల నుండి 12 గంటల వరకు పెంచుకునేందుకు యజమానులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది. సమ్మె హక్కును కాలరాస్తూ ఆంక్షలు విధించారు కార్మిక సంఘాల గుర్తింపు రిజిస్ట్రేషన్ కష్టతరం చేశారు. ఉద్యోగ భద్రతను పాతరావేశారు 300 మంది లోపు పని చేసే కంపెనీలో కార్మికులను ఎప్పుడైనా నోటీసు లేకుండా తొలగించేందుకు ఐరన్‌డ ఫైర్ విధానాన్ని తీసుకొచ్చారు. వేతనాల కోడు కనీస వేతనాలు నిర్ణయించే మౌలిక విధానానికి మంగళం పాడారు.కోడులతో భవనిర్మాణం, హమాలీ, ట్రాన్స్పోర్ట్ తదితర అసంఘటితరంగాల కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదిలేశారు. పిఎఫ్' ఈఎస్ఐ 'వెల్ఫేర్ బోర్డులకు గొడ్డలివేటు వేశారు.అంగన్వాడి, ఆశ,మధ్యాహ్న భోజనం, ఐకెపి వివో ఏ, పీల్డ్ అసిస్టెంట్, స్కీం వర్కర్స్ లను తొలగించే ప్రయత్నం చేస్తున్నారు కావున ఈ లేబర్ కోడ్లను రద్దు చేసే వరకు సిఐటియు గా ఉద్యమించాలని అందుకే దేశవ్యాప్తంగా ఆగస్టు 10న జైల్ బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి తూర్కపల్లి. సురేందర్, హమాలీ జిల్లా అధ్యక్షులు,:- జన్ని. జంగయ్య, గాడిపల్లి. నర్సింహా, ఇస్తారీ, రాములు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఆగష్టు 22,23,24 తేదీలలో జి.ఎం.పి.ఎస్ రాష్ట్ర 4వ మహాసభలు

యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి ఆగస్టు 5 తరంగాలు

ఆగష్టు 22,23,24 తేదీలలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా చెంగిచెర్లలో జరిగే జి.ఎం.పి.ఎస్ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా గొర్రెల,మేకల పెంపకందార్ల సంఘం జిల్లా కార్యదర్శి దయ్యాల నరసింహ పిలుపునిచ్చారు. బుధవారం వలిగొండ మార్కెట్ యార్డులో జిఎంపిఎస్ మండల కమిటీ సమావేశం మండల కార్యదర్శి బుగ్గ చంద్రమౌళి అధ్యక్షతన నిర్వహించగా ముఖ్యఅతిథిగా జిఎంపిఎస్ జిల్లా కార్యదర్శి దయ్యాల నరసింహ హాజరై, మాట్లాడారు. గొర్రెలు,మేకల పెంపకందారులు తరతరాలుగా వృత్తిని చేసుకుంటూ సమాజానికి బలమైన ఆహారాన్నిస్తూ వీరు మాత్రం సామాజికంగా,ఆర్థికంగా,రాజకీయంగా వెనుకబడి ఉన్నారు.గొర్రెల కాపరులను చైతన్యం చేస్తూ వారి హక్కుల కోసం పోరాడటానికి గత 30 సంవత్సరాలుగా గొర్రెలు,మేకల పెంపకందార్ల సంఘం (+వీూ) పోరాడి అనేక ఫలితాలను సాధించింది.అందులో భాగంగానే యాదాద్రి జిల్లాలో గొర్ల కాపరులను ఐక్యం చేసి రోడ్ల పైన జీవాలను తెప్పించి రాస్తారోకో చేసి భూస్వాములను పెత్తందారులను ఎదిరించి గొర్రెల,మేకలకు ఉచితంగా మేత మేపుకునే విధంగా జీవోను తీసుకొచ్చిందనీ అన్నారు.దొడ్డి కొమరయ్య వారసత్వాన్ని పునికి పుచ్చుకొని నాటి ఉమ్మడి రాష్ట్రంలోనూ నేటి తెలంగాణ రాష్ట్రంలోనూ అనేక ఉద్యమాలు నడుపుతుంది.జీవాలకు మందులు,పశువుల డాక్టర్లను,మేత భూములను,తుమ్మ చెట్లపై హక్కులను, ప్రమాదవశాత్తు చనిపోయిన వారికి ఎక్స్



గ్రేషియో,సబ్సిడీ రుణాలు సాధించాము.భవిష్యత్తులో అనేక ఉద్యమాలు చేసి సాధించాల్సిన అవసరం ఉంది.దానికోసం గొర్రెల కాపర్లు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు మేము అధికారంలోకి వచ్చిన 100రోజుల్లో నగదు బదిలీతో గొర్రెల పంపిణీ చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు పూర్తి అవుతున్నా అమలు చేయడం లేదు.ఈ ప్రభుత్వం వెంటనే అమలు చేయకపోతే జిఎంపిఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ నేపథ్యంలోనే జి.ఎం.పిఎస్ రాష్ట్ర 4వ మహాసభలు ఆగష్టు 22,23,24తేదీలలో చెంగిచెర్లలో నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ మహాసభలో గొర్రెల కాపరులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమాలు రూపొందిస్తామని తెలిపారు.ఈ మహాసభలకు గొల్ల,కురుమలు,విద్యావంతులు,మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిఎంపిఎస్ మండల అధ్యక్షులు నారి వెంకటేష్, నాయకులు చేగురి నరసింహ, కర్ణ కంటి యాదయ్య, నారి రామస్వామి, సల్ల ఐలయ్య, భీమనబోయిన జంగయ్య, నారి లింగస్వామి, కొమ్ము నరేష్ లు పాల్గొన్నారు.

## రమేష్ కోటి తండ్రి మృతికి రామ్‌కీ విల్లా ఓనర్స్ అసోసియేషన్ సంతాపం

- కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పిన అసోసియేషన్ ప్రతినిధులు



**వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 5,తరంగాలు :** కాంగ్రెస్ నాయకుడు, రామ్‌కీ విల్లా వాస్తవ్యుడు నల్లగొండ రమేష్ కోటి తండ్రి మృతికి రామ్‌కీ విల్లా ఓనర్స్ అసోసియేషన్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసింది. దివంగతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం కలగాలని ఆకాంక్షించింది.ఈ సందర్భంగా అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బేతి అశోక్ బాబు, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కోశాధికారి హనుమంతరావు, కోరే వెంకటస్వామి, రాము, సోమేశ్వర రెడ్డి, యాకూబ్ రెడ్డి, ప్రభాకర్, శ్రీనివాస్, రాంబాబు, సదానందం తదితర కమిటీ సభ్యులు తిమ్మాపురం గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.దివంగతులకు నివాళులర్పించిన వారు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో అసోసియేషన్ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- సర్పంచ్ శ్యామల శేఖర్



**నల్గొండ,ఆగస్టు5 తరంగాలు ప్రతినిధి :** కట్టంగూర్ : మండల కేంద్రంలో మంచినీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు గ్రామ సర్పంచ్ ముక్కాముల శ్యామల తెలిపారు. బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామకృష్ణ, ఏఈ రాజుతో కలిసి ఆమె మండల కేంద్రంలోని పలు వార్డుల్లో పర్యటించి స్థానికుల నుంచి మంచినీటి సరఫరాపై ఉన్న సమస్యలను తెలుసుకున్నారు.చెరువు కట్ట నుంచి కోట మైసమ్మ బజార్ వరకు ఉన్న తాగునీటి పైప్‌లైన్‌ను పరిశీలించారు. లీకేజీలు ఉన్న పైపులను గుర్తించి, అవసరమైన చోట నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేసి, దెబ్బతిన్న పైప్‌లైన్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను సర్పంచ్ శ్యామల కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్యామల మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి సరఫరా నిరంతరంగా కొనసాగేందుకు అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. గ్రామంలో మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. వారి వెంట వార్డ్ మెంబర్లు ఏనుగు సైదులు, ఎకుల సుజాత సైదులు, శ్రీరామ్ సంధ్య వీరేశ్ .గ్రామ ప్రజలు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు



## ప్రజారోగ్య పరిరక్షణలో కార్మికుల సేవలు కీలకం

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- పారిశుధ్య సిబ్బందికి ఎమ్మెల్యే చేతుల మీదుగా తొలి నెల జీతాల చెక్కులు అందజేత
- పారిశుద్ధ కార్మికులకు ఘన సన్మానం



**వర్ధన్నపేట ప్రతినిధి, ఆగస్టు 5,తరంగాలు** :పట్టణ పరిశుభ్రతతో పాటు ప్రజారోగ్య పరిరక్షణలో మున్సిపల్ పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. మున్సిపాలిటీలో పారిశుధ్య సిబ్బంది కొరతను దృష్టిలో ఉంచుకుని వరంగల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కొత్తగా 8 మంది పారిశుధ్య సిబ్బందిని తాత్కాలిక ప్రాతిపదికన విధుల్లోకి తీసుకున్నారు. విధుల్లో చేరిన సిబ్బందికి మొదటి నెల జీతాల చెక్కులను వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి ఆధ్వర్యంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అందజేశారు. అనంతరం కొత్తగా విధుల్లో చేరిన సిబ్బందిని శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ ఎండ, వానలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించేందుకు పారిశుధ్య సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. వారి సేవలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బెజ్జం పాపారావు, మలోతు దేవేందర్, తిరుపేల్లి వాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ నరకుడు వెంకటయ్య, పట్టణ అధ్యక్షులు ఈగ దామోదర్, మండల పార్టీ అధ్యక్షులు పోశాల వెంకన్న గౌడ్ , జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అబ్బిడి రాజిరెడ్డి, మండల యూత్ అధ్యక్షులు భాను ప్రసాద్, సీనియర్ నాయకులు కీమా నాయక్, బక్కతట్ల రాజ్ యాదవ్, నేతవత్ రాజేందర్, అధికారులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్‌కు క్షేత్రస్థాయిలో పటిష్ట పునాది

- బూత్, విలేజ్, మండల కమిటీల నియామకంపై కీలక సమీక్ష
- ఆగస్టు 15లోగా కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలి
- మహిళలు,ఎస్సీ,ఎస్టీ, ఓబీసీ,మైనారిటీలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలి
- సమీక్ష సమావేశంలో ఐనవోలు మండల కాంగ్రెస్ అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్



**హనుమకొండ ప్రతినిధి , ఆగస్టు 5, (తరంగాలు):** కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు బూత్, విలేజ్, మండల స్థాయి కమిటీల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ నిర్ణయించింది. టీపీసీసీ ఆదేశాల మేరకు డీసీసీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధ్యక్షతన కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐనవోలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్తో పాటు మండల ఇంచార్జులు పాల్గొని కమిటీల నియామక ప్రక్రియపై చర్చించారు.

సమావేశానికి టీపీసీసీ జనరల్ సెక్రటరీ, వరంగల్ పార్లమెంట్ ఇంచార్జి పల్లె శ్రీనివాస్ గౌడ్, టీపీసీసీ అధికార ప్రతినిధి, వర్ధన్నపేట ఇంచార్జి కూచన రవళి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఐనవోలు మండల ఇంచార్జులు నాగరాజు, ఇబ్రహీం, పులి శ్రీనివాస్, సుగుణ కిషోర్, హనుమకొండ జిల్లా జేబీఎం అధ్యక్షులు జన్నపురెడ్డి ఋగ్వేద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**క్షేత్రస్థాయి కార్యకర్తలే పార్టీకి బలం**

ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్తలే అసలైన బలమని అన్నారు. పార్టీని భవిష్యత్తులో మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు బూత్, విలేజ్, మండల కమిటీలు కీలకంగా పనిచేస్తాయని పేర్కొన్నారు.

అధిష్ఠానం విధించిన గడువు తక్కువగా ఉన్నందున ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేసి ఆగస్టు 15లోగా అన్ని బూత్, విలేజ్, మండల కమిటీల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. మండల కమిటీలో సభ్యుల సంఖ్య 21 మందికి మించకూడదని స్పష్టం చేశారు.

**మహిళలకు 30 శాతం ప్రాతినిధ్యం**

కమిటీల ఏర్పాటులో సామాజిక న్యాయానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రెడ్డి సూచించారు. ప్రతి కమిటీలో కనీసం 30 శాతం మహిళలకు ప్రాతినిధ్యం కల్పించాలని, మహిళలకు ప్రాతినిధ్యం లేని కమిటీలను అధిష్ఠానం ఆమోదించదని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ వర్గాలకు కూడా తగిన ప్రాతినిధ్యం కల్పించి అన్ని వర్గాల సమన్వయంతో కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు.

**ఆగస్టు 15--31 మధ్య తొలి సమావేశం**

కమిటీల నియామక ప్రక్రియ పూర్తయిన అనంతరం ఆగస్టు 15 నుంచి 31 మధ్య ఆయా మండలాల్లో తొలి అధికారిక మండల కమిటీ సమావేశాలను నిర్వహించాలని సూచించారు. కమిటీల నియామకంలో మండల అధ్యక్షులు, ఇంచార్జ్ కమిటీ సభ్యులు స్థానిక ఎమ్మెల్యేల సూచనలు తీసుకుని పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు.

## నునుక వెంకటయ్య కుటుంబానికి ఎమ్మెల్యే నాగరాజు పరామర్శ



**వర్ధన్నపేట ప్రతినిధి, ఆగస్టు 5,తరంగాలు** : మండలంలోని కట్ర్యాల గ్రామానికి చెందిన నునుక వెంకటయ్య ఇటీవల మృతి చెందాడు.విషయం తెలుసుకున్న వర్ధన్నపేట శాసనసభ్యులు, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు బుధవారం ఆయన నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎమ్మెల్యే నాగరాజు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పోశాల వెంకన్న గౌడ్ , మార్కెట్ కమిటీ చైర్మన్ నరకుడు వెంకటయ్య, మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, ఐనవోలు దేవస్థానం చైర్మన్ ప్రభాకర్ గౌడ్, పట్టణ అధ్యక్షులు ఈగ దామోదర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ, మండల బ్లాక్ మాజీ అధ్యక్షులు అబ్బిడి రాజిరెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు మరుపట్ల అరుణ-సాయి , మండల మహిళా బ్లాక్ అధ్యక్షురాలు సునీత, మండల యూత్ అధ్యక్షులు భాను ప్రసాద్, గ్రామ ఉపసర్పంచ్ రవీందర్, గ్రామశాఖ మాజీ అధ్యక్షులు సతీష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు దామెర ప్రశాంత్‌తో పాటు నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి ముఖ్య నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బ్లాక్‌స్పాట్లపై ఎస్పీ ఫోకస్

- ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు
- ప్రమాదకర ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన
- స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్ట్రిప్స్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశం
- అక్రమ కట్స్, పార్కింగ్ తొలగింపునకు ప్రత్యేక ఆదేశాలు
- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్



**నల్గొండ, ఆగస్టు 5 (తరంగాలు):** జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ బుధవారం ప్రమాదాలకు గురయ్యే బ్లాక్‌స్పాట్లు, యాక్సిడెంట్ ప్రోన్ ఏరియాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఎస్‌హెచ్-02, ఎన్‌హెచ్-167 మార్గాల్లోని వెల్‌కమ్ టు మిర్యాలగూడ జంక్షన్, నందిపాడు ఎక్స్ రోడ్డు, చిల్లాపురం క్రాస్ రోడ్డు, చింతపల్లి క్రాస్ రోడ్డు, జంకుతాండా రోడ్డు, మిర్యాలగూడ అప్రోచ్ రోడ్డు ప్రాంతాలను సందర్శించిన ఎస్పీ.. తరచూ ప్రమాదాలు జరగడానికి గల కారణాలను సంబంధిత అధికారులతో సమీక్షించారు.అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, ప్రమాదకర ఓవర్‌టేకింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన, హెచ్చరిక బోర్డుల కొరత, చెరిగిపోయిన రోడ్ మార్కింగ్‌లు, అక్రమ పార్కింగ్, రాత్రివేళల్లో తగినంత వెలుతురు లేకపోవడం, అనధికారిక రోడ్డు కట్స్ తదితర అంశాలను ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా గుర్తించారు.ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా క్రాసింగ్‌లు, సెంటర్ లైన్లు, రోడ్ మార్కింగ్‌ల రీ-పెయింటింగ్, రంబుల్ స్ట్రిప్స్, సీసీ కెమెరాలు, బారికేడింగ్, రిఫ్లెక్టివ్ హెచ్చరిక బోర్డులు, దిశా సూచికలు, క్యాట్ ఐస్ వంటి భద్రతా చర్యలను అత్యవసరంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అన్ని జంక్షన్ల వద్ద అక్రమ పార్కింగ్‌ను పూర్తిగా తొలగించి వాహనాల రాకపోకలకు ఆటంకం లేకుండా చూడాలని సూచించారు.ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ట్రాఫిక్, పోలీసు, ఇతర శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రమాదకర ప్రాంతాల్లోని లోపాలను గుర్తించి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. అనవసర జంక్షన్లు, అనధికారిక కట్స్‌ను సాధ్యమైనంత వరకు మూసివేసి, అవసరమైన చోట మాత్రమే నియంత్రిత యూ-టర్న్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదకర కూడళ్ల వద్ద అదనపు ట్రాఫిక్ సిబ్బందిని నియమించడం, ట్రాఫిక్ ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించడం, రద్దీ సమయాల్లో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. వాహనదారులు అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం, నిర్లక్ష్యపు ఓవర్‌టేకింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే అనేక ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు.ప్రమాదకర ప్రాంతాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను త్వరితగతిన ఏర్పాటు చేసి ప్రజల ప్రాణ రక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో మిర్యాలగూడ ఇన్‌చార్జ్ డీఎస్పీ రవి, సీఐలు పి.ఎన్.డి. ప్రసాద్, సోమనర్సయ్య, నాగభూషణ్, నాగరాజు, ఎస్‌ఐ లక్ష్మయ్య, డీటీఆర్‌బీ ఇన్‌చార్జ్ రిటైర్డ్ సీఐ అంజయ్యతో పాటు ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఎక్సైజ్, ట్రాన్స్‌పోర్ట్, రోడ్డు భద్రత అధికారులు, స్థానిక ప్రజలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## సోలార్ యూనిట్ల ఏర్పాటును వేగవంతంగా పూర్తి చేయాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి , ఆగస్టు 5, తరంగాలు :**

మోడల్ సోలార్ విలేజ్ కార్యక్రమం కింద సోలార్ రూఫ్‌టాప్ యూనిట్ల ఏర్పాటును వేగవంతంగా పూర్తి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.బుధవారం రాయపర్తి మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఏర్పాటు చేస్తున్న సోలార్ యూనిట్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పరిశీలించారు. లబ్ధిదారుల ఇళ్లపై ఏర్పాటు చేసిన సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థలను సందర్శించి, పనుల పురోగతిపై తెలంగాణ రెడ్కో, విద్యుత్ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మిగిలిన లబ్ధిదారుల ఇళ్లపై సోలార్ యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన మెటీరియల్‌ను వెంటనే అందుబాటులోకి తీసుకువచ్చి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.మోడల్ సోలార్ విలేజ్ కార్యక్రమంలో భాగంగా అర్హులైన గృహజ్యోతి వినియోగదారుల ఇళ్లపై 2 కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థను ఉచితంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా ప్రతి ఇంటికి నెలకు సుమారు 240 నుంచి 250 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, స్వీయ వినియోగం అనంతరం మిగిలిన విద్యుత్తును గ్రిడ్‌కు పంపించడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని వివరించారు.సోలార్ విద్యుత్ వినియోగం వల్ల విద్యుత్ బిల్లుల భారం తగ్గడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణకు, సంప్రదాయ ఇంధన వనరుల సంరక్షణకు కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. పోతిరెడ్డిపల్లి గ్రామాన్ని వరంగల్ జిల్లాలో ఆదర్శ మోడల్ సోలార్ విలేజ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ రామిరెడ్డి, టీజీ రెడ్కో జిల్లా మేనేజర్ రాజేందర్, రాయపర్తి తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాసులు, టీజీ రెడ్కో ఫీల్డ్ ఆఫీసర్ నవీన్ కుమార్ యాదవ్, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, పోతిరెడ్డిపల్లి, కిస్టాపూర్ గ్రామాల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## తమిళనాట తొలి బడ్జెట్ ప్రవేశ పెట్టిన విజయ్ ప్రభుత్వం

- 'అన్నన్ సీర్ తిట్టమ్'నకు బడ్జెట్‌లో రూ.812 కోట్లు కేటాయింపు

చెన్నై,ఆగస్ట్5 తమిళనాడు ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టింది. సీఎంగా విజయ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత తీసుకొచ్చిన తొలి బడ్జెట్ కావడంతో సర్వత్రా ఆసక్తి వ్యక్తమైంది. ఆర్థిక మంత్రి ఎన్. మేరీ విల్సన్ దీనిని సభ ముందుంచారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, మహిళా సంక్షేమం, మౌలిక సదుపాయాలపై విజయ్ సర్కార్ ఈ పద్దులో ప్రధానంగా దృష్టిసారించింది. ఎన్నికల హామీల్లో భాగమైన 'అన్నన్ సీర్ తిట్టమ్'ను టీవీకే ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో ప్రకటించింది. దానికింద వధువుకు 8 గ్రాముల బంగారం, ఒక పట్టుచీరను అందిస్తారు. ఈ పథకం కోసం రూ.812 కోట్లు కేటాయించారు. 2031 నాటికి ఐదు లక్షల మందికి కృత్రిమ మేధలో శిక్షణ ఇస్తామని ప్రకటించింది. ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులకు ఈ శిక్షణ అందనుంది. వెట్రిథిరన్ ట్రైనింగ్ స్కీమ్ కింద దశలవారీగా లక్షమంది ఉద్యోగార్థులు నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందనున్నారు. రూ.2వేల కోట్లతో విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్స్ అందించేందుకు వెట్రి ల్యాప్‌టాప్ స్కీమ్‌ను బ్జడెట్‌లో ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ కోసం ఈ ఏడాదికి రూ.300 కోట్లు కేటాయించారు.

## అవసరమైతే వందసార్లయినా అరెస్ట్ అవుతా

**ఎవరి బెదిరింపులకు లొంగేది లేదు: ఉదయనిధి**

చెన్నై,ఆగస్ట్5 సినీ నటి త్రిషా కృష్ణన్‌పై చేసిన వ్యాఖ్యల వివాదంలో అరెస్టయి, విడుదలైన.. డీఎంకే సీనియర్ నేత, తమిళనాడు ప్రతిపక్ష నాయకుడు ఉదయనిధి స్టాలిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. విడుదల అనంతరం తన తండ్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్‌తో ఉన్న ఫొటోను సోషల్ మీడియా 'ఎక్స్'లో షేర్ చేసిన ఆయన.. రాజకీయ ఒత్తిళ్లకు తాను భయపడబోనని స్పష్టం చేశారు. 'నేను కలైంజర్ మనవడిని.. ఎంకే స్టాలిన్ కుమారుడిని.. డీఎంకే కార్యకర్తను. ఇలాంటి బెదిరింపులకు భయపడేది లేదు. రైతుల కోసం పోరాడే క్రమంలో ఒక్కసారి కాదు.. అవసరమైతే వందసార్లు అరెస్ట్ అయ్యేందుకైనా సిద్ధమే. ప్రజాసేవను ఎలాంటి అణచివేత ఆపలేదు' అని ఉదయనిధి స్టాలిన్ తన ఎక్స్ పోస్ట్‌లో రాసుకొచ్చారు. అంతకుముందు.. త్రిషా కృష్ణన్‌పై ఉధయనిధి చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. దీంతో మంగళవారం(ఈనెల 4న) పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం సాయంత్రం విడుదల చేశారు. ఆ తర్వాత అధికార పక్షాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారాయన. రైతుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన ప్రభుత్వం.. ప్రజల దృష్టిని మళ్లించేందుకే తనను అరెస్ట్ చేయించిందని ఆరోపించారు.

# పేదలకు ఉచిత వైద్యం అభినందనీయం





- ఆరోగ్య శిబిరాలతో వ్యాధులను ముందుగానే గుర్తించవచ్చు: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- కంటి,రక్త పరీక్షలు చేయించుకున్న ఎమ్మెల్యే
- రోగులకు ఉచితంగా మందుల పంపిణీ
- రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్ల అందజేత



**వర్ధన్నపేట ప్రతినిధి, ఆగస్టు 5,తరంగాలు :** గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. బుధవారం వర్ధన్నపేట మండలం కట్ర్యాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సహృదయ సేవా



ట్రస్ట్, లయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ ట్రైసిటీ ప్రెసిడెంట్ మహ్మద్ మహబూబ్ అలీ (చోటు )ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంపును ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాలకు వెళ్లి ఖరీదైన వైద్యం చేయించుకోలేని పేదలకు ఆరోగ్య శిబిరాలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని అన్నారు. గ్రామీణ ప్రజలకు లయన్స్ క్లబ్ ద్వారా ఉచిత వైద్య సేవలు అందించడం గొప్ప సేవా కార్యక్రమమని ప్రశంసించారు. ఇలాంటి శిబిరాలు ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచడంతో పాటు వ్యాధులను తొలిదశలోనే గుర్తించి సకాలంలో చికిత్స అందించేందుకు దోహదపడతాయని తెలిపారు.ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజా ఆరోగ్యానికి సేవలందిస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ ట్రైసిటీ ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించారు.అనంతరం గ్రామ ప్రజలతో పాటు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కూడా కంటి, రక్త పరీక్షలు చేయించుకున్నారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి ఎమ్మెల్యే మందులు పంపిణీ చేశారు. రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్లు అందజేశారు.కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ్ , మార్కెట్ కమిటీ చైర్మన్ నరకుడు వెంకటయ్య, మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, ఐనవోలు దేవస్థానం చైర్మన్ ప్రభాకర్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, మాజీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, మండల బ్లాక్ మాజీ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు మరుపట్ల అరుణ-సాయి , మండల మహిళా బ్లాక్ అధ్యక్షురాలు సునీత, మండల యూత్ అధ్యక్షుడు భాను ప్రసాద్, గ్రామ ఉప సర్పంచ్ రవీందర్, గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు సతీష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దామెర ప్రశాంత్‌తో పాటు నియోజకవర్గ, మండల, గ్రామ ముఖ్య నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# స్ఫూర్తి కార్యక్రమం ద్వారా విద్యార్థినుల్లో చైతన్యం పెంపొందించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వర్ధన్నపేట ప్రతినిధి , ఆగస్టు 5, తరంగాలు** :స్ఫూర్తి కార్యక్రమం ద్వారా విద్యార్థినుల్లో చైతన్యం పెంపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు.జిల్లాలో నిర్వహిస్తున్న 'స్ఫూర్తి' కార్యక్రమంలో భాగంగా వర్ధన్నపేట గిరిజన బాలికల వసతి గృహాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించి విద్యార్థినులతో ఆత్మీయంగా మమేకమయ్యారు.ఈ సందర్భంగా నిర్వహించిన స్ఫూర్తి కార్యక్రమంలో రాజ్యాంగంలోని నాలుగో స్థంభంగా భావించే జర్నలిజం ప్రాముఖ్యతపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ విద్యార్థినుల విద్యాభ్యాసం, ఆరోగ్యం, వసతి సౌకర్యాలు, ఆహార నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు.విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదివి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు.ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసంపై కూడా దృష్టి సారించాలని ప్రోత్సహించారు.ఈ సందర్భంగా వసతి గృహంలోని సౌకర్యాలను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు



లేకుండా అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న సీనియర్ జర్నలిస్టు, కృష్ణమోహన్ మాట్లాడుతూ విద్యార్థినులు భవిష్యత్తుపై స్పష్టమైన లక్ష్యాలు ఏర్పరుచుకొని స్వీయ చైతన్యంతో ముందుకు సాగాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధి కోసం ప్రతిరోజూ వార్తాపత్రికలు చదివే అలవాటు పెంచుకోవాలని, సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.అనంతరం వంట సామాగ్రి నిల్వలు పరిశీలించారు.. వర్షాకాలం జాగ్రత్తంగా శుభ్రత పరిశుభ్రత పాటించాలని వార్డెన్ ను ఆదేశించారు.మధ్యాహ్న భోజనం పిల్లలతో కలిసి భోజనం చేశారు.. పిల్లలతో ముచ్చటించి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రాంరెడ్డి, డిబీసీడీఓ పుష్పలత, డి టి డి ఓ నారాయణరెడ్డి, తహసిల్దార్ విజయ్ సాగర్,ఎంపీడీవో వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



# సైబర్ మోసాలపై అప్రమత్తతే రక్షణ

- ఆశాజనక ఆఫర్లతో వల.. వ్యక్తిగత, బ్యాంకు వివరాలు ఇవ్వొద్దు
- కలెక్టరేట్ సిబ్బందికి అవగాహన కార్యక్రమంలో హనుమకొండ డీసీపీ ధార కవిత





**హనుమకొండ ప్రతినిధి , ఆగస్టు 5, తరంగాలు** : దురాశ, అవగాహన లేమిని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారని, అప్రమత్తతతో వ్యవహరిస్తేనే ఇటువంటి నేరాలను నివారించవచ్చని హనుమకొండ డీసీపీ ధార కవిత అన్నారు.
బుధవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సిబ్బందికి సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి, డీసీపీ ధార కవిత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ కంప్యూటర్లు, ఇంటర్నెట్, డిజిటల్ పరికరాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాలు గణనీయంగా పెరుగుతున్నాయని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారా సైబర్ నేరాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. బ్యాంకు రుణాలు, ప్రభుత్వ ప్రయోజనాలు, తక్కువ ధరలకు వస్తువుల విక్రయం, ఉద్యోగ అవకాశాలు, పెట్టుబడులపై అధిక లాభాలు వంటి ఆశాజనకమైన ఆఫర్లతో సైబర్ నేరగాళ్లు ప్రజలను వలలో వేసుకుంటున్నారని వివరించారు. అనంతరం ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింకుల ద్వారా ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం, డెబిట్, క్రెడిట్ కార్డు సమాచారం, వ్యక్తిగత వివరాలను సేకరించి మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు.యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల్లో కనిపించే ప్రకటనలను నమ్మి పెట్టుబడులు పెట్టవద్దని సూచించారు. అపరిచిత వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయరాదని, వ్యక్తిగత లేదా బ్యాంకు వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ ఉన్నత విద్యావంతులు, ప్రభుత్వ ఉద్యోగులు సైతం సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలు, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయనే ఆశ చూపి ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా సైబర్ నేరాల నివారణకు అప్రమత్తంగా ఉంటూ ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు కృషి చేస్తామని అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో డీఆర్ఓ శ్రీనివాస్, డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, హనుమకొండ, కాజీపేట ఏసీపీలు పింగిలి ప్రశాంత్ రెడ్డి, నరసింహారావు, డీఆర్డీఓ మేన శ్రీను, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

THARANGALU DAILY NEWS
గురువారం , 06 ఆగస్టు , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# విద్యార్థుల్లో సైబర్ అవగాహన పెంచాలి






- ఉపాధ్యాయులకు వరంగల్ పోలీసుల ప్రత్యేక శిక్షణ
- సైబర్ నేరాల నివారణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్న కమిషనర్
- వ్యక్తిగత సమాచార భద్రతపై అప్రమత్తంగా ఉండాలని సూచన
- విద్యార్థులు,తల్లిదండ్రుల్లో చైతన్యం కల్పించాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత

**హనుమకొండ, ఆగస్టు 5 (తరంగాలు ప్రతినిధి):** విద్యార్థుల్లో సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అన్నారు. "సురక్షా కా తిరంగా" కార్యక్రమంలో భాగంగా సెంట్రల్ జోన్ పోలీసుల ఆధ్వర్యంలో హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించిన సైబర్ అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ముందుగానే అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ అధికారులు ప్రస్తుతం జరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు, నేరగాళ్లు అనుసరిస్తున్న కొత్త పద్ధతులు, వాటి నుంచి ఎలా రక్షించుకోవాలనే అంశాలను దృశ్య ప్రదర్శనల ద్వారా వివరించారు. అనంతరం పోలీస్ జాగృతి కళాబృందం సభ్యులు సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా సైబర్ భద్రతపై సందేశాలు అందించి ఉపాధ్యాయుల్లో చైతన్యం కల్పించారు. కార్యక్రమం ప్రారంభంలో కమిషనర్‌కు సైబర్ విభాగం అధికారులు స్వాగతం పలికారు. దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని కమిషనర్ తెలిపారు. అత్యాశ, భయం, అత్యవసర పరిస్థితులను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారని చెప్పారు. అవగాహన ఉన్నప్పటికీ చిన్నపాటి నిర్లక్ష్యం వల్లే చాలా మంది ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ డిజిటల్ లావాదేవీల్లో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సెల్‌ఫోన్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో వ్యక్తిగత గోప్యతకు ముప్పు ఏర్పడుతోందని ఆమె హెచ్చరించారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింకులు, సందేశాలు, ఫోటోలు లేదా ఫైళ్లపై క్లిక్ చేయకూడదని సూచించారు. మొబైల్ ఫోన్లలో గోప్యతా అమరికలను తప్పనిసరిగా సరిచేసుకోవాలని, వ్యక్తిగత వివరాలు, కుటుంబ సమాచారం, ఫోటోలను సామాజిక మాధ్యమాల్లో విచక్షణారహితంగా పంచుకోవద్దని హెచ్చరించారు.పిల్లలకు చిన్నప్పటి నుంచే వ్యక్తిగత జీవితం, బహిరంగ జీవితం మధ్య ఉన్న తేడాను వివరించాలని కమిషనర్ సూచించారు. ఆన్‌లైన్ కొనుగోళ్లు, డిజిటల్ చెల్లింపులు, సామాజిక మాధ్యమాల వినియోగంలో పాటించాల్సిన జాగ్రత్తలపై ఉపాధ్యాయులు విద్యార్థులకు నిరంతరం అవగాహన కల్పించాలని చెప్పారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను కూడా సైబర్ భద్రతపై చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమం ముగింపులో ఉపాధ్యాయులతో సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ విద్యార్థులు, తల్లిదండ్రుల్లో అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అలాగే సైబర్ నేరాల నివారణపై రూపొందించిన అవగాహన పోస్టర్లను పోలీస్ కమిషనర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమములో సెంట్రల్ జోన్ డిసిపి దారా కవిత, విద్యాశాఖ సి.యం.ఓ సుమ, హన్మకొండ, సైబర్ క్రైమ్, ఎస్.బి ఎసిపిలు నర్సింహరావు, వెంకటరమణ, జాన్ నర్సింహులు, ఇన్స్‌స్పెక్టర్లు రజింత్, శివకుమార్, రవికుమార్,అశోక్, ప్రవీణ్ కుమార్‌తో పాటు ఇతర పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.






# ఆకర్షణీయమైన ప్రకటనలతో పెట్టుబడులు పెట్టి మోస పోవద్దు





- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత

**వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 5,తరంగాలు :** సామాజిక మధ్యామాల్లో వచ్చే ఆకర్షనీయమైన ప్రకటనలను చూసి పెట్టుబడులు పెట్టి సైబర్ నేరగాళ్ల చేతుల్లో మోసపోవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత తెలిపారు.జాతీయ సైబర్ జాగృతి దివస్ సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సురక్షా కా తిరంగా -- సైబర్ ఇండిపెండెంట్ తెలంగాణ వైపు" రాష్ట్రవ్యాప్త సైబర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా కాజీపేట పోలీసుల ఆధ్వర్యంలో కాజీపేట నిట్ కళాశాలలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ , నేటి డిజిటల్ యుగంలో సాంకేతికత ఎంత వేగంగా అభివృద్ధి చెందుతోందో , అదే స్థాయిలో సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా స్టాక్ ట్రేడింగ్ మరియు స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు ఆందోళనకరంగా పెరుగుతున్నాయని పేర్కొన్నారు.మోసగాళ్లు "100శాతం గ్యారంటీ రిటర్న్స్" , "డైలీ ప్రాఫిట్" , "ఇన్‌సైడర్ టిప్స్" , "ప్రత్యేక పెట్టుబడి అవకాశాలు" వంటి తప్పుడు హామీలతో అమాయక ప్రజలను ఆకర్షిస్తున్నారని తెలిపారు. నకిలీ ట్రేడింగ్ యాప్‌లు , నకిలీ వెబ్‌సైట్లు , వాట్సాప్ మరియు టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా ప్రారంభంలో నకిలీ లాభాలను చూపించి , అనంతరం మరింత పెట్టుబడి పెట్టేలా ప్రలోభపెట్టి , చివరకు జైష్ , ప్రాసెసింగ్ ఫీజు , అప్‌గ్రేడేషన్ ఛార్జీలు వంటి పేర్లతో అదనపు డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడుతున్నారని హెచ్చరించారు.అదేవిధంగా నకిలీ ఆర్థిక సలహాదారులు , నకిలీ కంపెనీ ప్రతినిధులుగా నటిస్తూ చట్టబద్ధమైన అనుమతులు లేని సంస్థల ద్వారా పెట్టుబడులు సేకరించి ప్రజలను మోసం చేస్తున్నారని సీపీ తెలిపారు.ఈ సందర్భంగా ప్రజలకు ఆయన పలు సూచనలు చేస్తూ అధిక లాభాలు వస్తాయని చెప్పే ప్రతి పెట్టుబడిని నమ్మవద్దు. పెట్టుబడి పెట్టే ముందు సంబంధిత సంస్థ లేదా బ్రోకర్ అధికారికంగా నమోదు అయి ఉందో లేదో తప్పనిసరిగా ధృవీకరించాలి. సోషల్ మీడియా , వాట్సాప్ , టెలిగ్రామ్ లేదా అపరిచిత వ్యక్తులు ఇచ్చే పెట్టుబడి సూచనలను నమ్మరాదు. వెంటనే పెట్టుబడి పెట్టాలని ఒత్తిడి చేసే వ్యక్తులను విశ్వసించరాదు. పెట్టుబడి పెట్టే ముందు కుటుంబ సభ్యులు లేదా అర్హత కలిగిన ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవాలని,సైబర్ మోసాలకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్కు కాల్ చేయాలని లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్లో ఫిర్యాదు నమోదు చేయాలని సీపీ సూచించారు.అనంతరం పోలీస్ కమిషనర్ సైబర్ నేరాలపై రూపొందించిన వాల్ పోస్టర్లను విడుదల చేయడంతో పాటు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటామంటూ విద్యార్థులు అధ్యాపకుల చేత ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమం నిట్ కళాశాల డైరెక్టర్ డా. ప్రొఫెసర్ సుబుధి,సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, రిజిస్టర్ సునీల్ మెహతా, ఏసీపీ లు ప్రశాంత్ రెడ్డి, వెంటరమణ, జాన్ నర్సింహులు, ఇన్స్ స్పెక్టర్లు శ్యామ్ సుందర్, అశోక్, ప్రవీణ్ పాల్గొన్నారు.

## భారత చీఫ్ సెలెక్టర్‌గా వీవీఎస్ లక్ష్మణ్!?

### అజిత్ అగార్కర్‌పై వేటుపడే అవకాశం



భారత క్రికెట్ పురుషుల సెలెక్షన్ కమిటీ చీఫ్ సెలెక్టర్‌గా మళ్లీ తెలుగు వ్యక్తి బాధ్యతలు చేపట్టబోతున్నాడా? అంటే అవుననే సమాధానం వినిపి స్తోంది. టీమిండియా దిగ్గజ క్రికెటర్, తెలుగు తేజం, సొగసరి బ్యాటర్ వీవీఎస్ లక్ష్మణ్ చీఫ్ సెలెక్టర్ పదవి రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. టీమిండియా వరుస పరాజయాల నేపథ్యంలో ప్రస్తుత చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌పై వేటు పడే అవకాశం ఉంది. అతని కాంట్రాక్ట్‌ను పొడిగించేందుకు బీసీసీఐ సుముఖంగా లేదని ఓ సీనియర్ స్పోర్ట్స్ జర్నలిస్ట్ సోషల్ మీడియా వేదికగా ఓ కథనాన్ని రాయడం తీవ్ర చర్చనీయాంశమైంది. 'భారత చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవి ప్రమాదంలో పడింది. అతన్ని కొనసాగించేందుకు బీసీసీఐ సుముఖంగా లేదు. భారత నయా చీఫ్ సెలెక్టర్ పదవి రేసులో వీవీఎస్ లక్ష్మణ్ ముందంజలో ఉన్నారు. వీవీఎస్ లక్ష్మణ్ ఎంట్రీతో అజిత్ అగార్కర్‌కు ఉద్వాసన తప్పేలా లేదు. ప్రస్తుతం ఈ వ్యవహారం చర్చల దశలోనే ఉంది. సెప్టెంబర్‌లో జరిగే బీసీసీఐ వార్షిక సర్వ సభ్య సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. లక్ష్మణ్ చీఫ్ సెలెక్టర్‌గా ఉంటే అతని మాటలకు విలువ ఉంటుందని, రోహిత్, విరాట్ కోహ్లీ వంటి ఆటగాళ్లు కూడా అతని సలహాలు పాటిస్తారని బీసీసీఐ అధికారులు భావిస్తున్నారు. ఇటీవల టీమ్ సెలెక్షన్ విషయంలో అగార్కర్ తీసుకున్న కొన్ని నిర్ణయాలపై ప్రశ్నలు తలెత్తాయి. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకొని అగార్కర్‌ను కొనసాగించాలా? లేక లక్ష్మణ్‌ను తీసుకురావాలా?అనేది బీసీసీఐ బేరిజు వేస్తోంది. శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్ ఫలితంపైనే ఈ నిర్ణయం ఆధారపడి ఉంది. ఒకవేళ భారత్ ఈ సిరీస్‌ను గెలిస్తే.. అగార్కర్ పదవీకాలం పొడిగించవచ్చు. రోహిత్ శర్మ రిటైర్మెంట్ వార్తలపై కూడా బీసీసీఐ పెద్దలు ఆగ్రహంగా ఉన్నారు. సెక్రటరీ దేవజిత్ సైకియా వచ్చి వివరణ ఇవ్వాల్సి వచ్చింది. ప్రస్తుతం భారత జట్టును నడిపిస్తున్న వారికి రోహిత్ శర్మ జట్టులో కొనసాగడం ఇష్టం లేదు.ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో ఎదురైన ఓటములపై ఇప్పటివరకు సమీక్షా సమావేశం జరగలేదు. ఇంగ్లండ్ పర్యటన తర్వాతే ఈ రివ్యూ మీటింగ్ జరగాల్సింది. కానీ దేజిత్ సైకియా అనారోగ్యం కారణంగా ఈ సమీక్ష సమావేశం జరగలేదని బోర్డు వర్గాలు తెలిపాయి. రాబోయే రోజుల్లో ఈ సమావేశం జరగనుంది. గంభీర్.. ఆన్‌లైన్ వేదికగా ఈ మీటింగ్‌లో పాల్గొనే అవకాశం ఉంది.'అని అభిషేక్ త్రిపాఠి అనే స్పోర్ట్స్ జర్నలిస్ట్ తన కథనంలో రాసుకొచ్చాడు.2023 జూలైలో భారత చీఫ్ సెలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అజిత్ అగార్కర్ పదవి కాలం ఈ ఏడాది సెప్టెంబర్‌లో ముగియనుంది. టీమిండియా సపోర్ట్ స్టాఫ్ మెంబర్స్ టీ దిలీప్, ర్యాన్ టెన్ డస్కాటే తరహాలో అజిత్ అగార్కర్‌పై బీసీసీఐ వేటు వేస్తుందా? లేక కొనసాగిస్తుందా? అనేది చూడాలి. తెలుగు రాష్ట్రాల నుంచి ఎమ్మెస్కే ప్రసాద్ చివరిసారిగా భారత చీఫ్ సెలెక్టర్‌గా వ్యవహరించారు.

## రోహిత్ తనంతట తాను వైదొలిగే ప్రసక్తే లేదు

### రోహిత్ శర్మ రిటైర్మెంట్ పై మహమ్మద్ కైఫ్ వ్యాఖ్యలు



భారత వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ రిటైర్మెంట్ అంశంపై టీమిం డియా మాజీ ఆటగాడు మహమ్మద్ కైఫ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ శర్మ తనంతట తానుగా క్రికెట్ నుంచి వైదొలిగే ప్రసక్తే లేదని, ఒకవేళ అతన్ని తొలగించాలనుకుంటే సెలెక్టర్లే ఆ పని చేయాలని నేరుగా సవాలు విసిరాడు. 2027 ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ ఆడతాడా లేదా అనే దానిపై బోర్డు ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన ప్రకటన చేయకపోవడంపై కైఫ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాడు.సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియాల వేదికగా జరగనున్న 2027 వన్డే ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ ఆడతాడా లేదా అనే ప్రశ్న అభిమానులతో పాటు విశ్లేషకులను కూడా వేధిస్తోంది. జులై 19న ఆడే మ్యాచే రోహిత్ చివరి అంతర్జాతీయ మ్యాచ్ అంటూ వచ్చిన వార్తలను బిసిసిఐ కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా ఖండించినప్పటికీ, రోహిత్ భవిష్యత్తుపై మాత్రం మేనేజ్‌మెంట్ నుంచి ఎలాంటి అధికారిక హామీ లభించలేదు. దీనిపై కైఫ్ తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ "రోహిత్‌కు నచ్చినట్లు ఆడే స్వేచ్ఛ ఇచ్చామని చెబుతున్న కోచ్‌లు, అతను 2027 వరల్డ్ కప్ ప్లాన్స్‌లో ఉన్నాడో లేదో స్పష్టంగా ఎందుకు చెప్పడం లేదు?" అని నిలదీశాడు. గతంలో లార్డ్స్ మైదానంలో జులై 19న జరిగే వన్డేనే రోహిత్‌కు చివరిదని ప్రచారం జరిగింది. కానీ ఆ వార్తలను బీసీసీఐ ఖండించడమే కాకుండా, ఆ మ్యాచ్‌లో రోహిత్ శర్మ కేవలం 84 బంతుల్లో 17 ఫోర్లు, 5 సిక్సర్ల సాయంతో 138 పరుగులతో విరవిరుచుకుపడ్డాడు. ఇది అతనికి వన్డేల్లో 34వ సెంచరీ కాగా, 2026 సంవత్సరంలో తొలి సెంచరీ. భారత్ ఆ మ్యాచ్‌లో ఓడిపోయినప్పటికీ రోహిత్ బ్యాటింగ్‌తో విమర్శకుల నోళ్లు మూయించాడు. బోర్డు జోక్యం చేసుకోవడం, రోహిత్ సెంచరీ బాదడం వల్ల ఆ సమయంలో పెద్ద వివాదం తప్పిందని కైఫ్ పేర్కొన్నాడు.జట్టు మేనేజ్‌మెంట్, బీసీసీఐ పబ్లిక్‌గా సరైన ప్రకటన చేయకపోవడం వల్లే అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని కైఫ్ అభిప్రాయపడ్డాడు. ఆటగాడి ఫామ్‌లో హెచ్చుతగ్గులు సహజమని, బోర్డు రోహిత్‌కు పూర్తి మద్దతుగా నిలబడాల్సిన అవసరం ఉందన్నాడు. బయట ఉన్నవారికి లోపల ఏం జరుగుతుందో పూర్తిగా తెలియకపోయినా, రోహిత్ శర్మ మాత్రం తనను ఎవరూ తప్పించలేరని, ఒకవేళ వెళ్లాలనుకుంటే ఆ నిర్ణయం తన చేతుల్లోనే ఉంచుకోవాలని భావిస్తున్నాడని కైఫ్ స్పష్టం చేశాడు. రోహిత్ శర్మను వన్డే జట్టులో కొనసాగించాలా వద్దా అనే విషయమై సెలెక్టర్ల మధ్య కూడా లోపల మంతనాలు జరుగుతున్నాయని, ఇంకా ఎలాంటి ఆఖరి నిర్ణయం తీసుకోలేదని సమాచారం. రాబోయే పర్యటనలు, సిరీస్‌ల ఆధారంగా బీసీసీఐ రోహిత్ శర్మ విషయంలో ఒక స్పష్టమైన ప్రకటన చేసే అవకాశం కనిపిస్తోంది.

## 2027 వన్డే ప్రపంచకప్ షెడ్యూల్ ప్రకటించిన ఐసీసీ

ఫిబ్రవరి 22 నుంచి మార్చి 23 వరకు మ్యాచ్ లు

వచ్చే ఏడాది సౌతాఫ్రికా వేదికగా జరగనున్న ప్రతిష్టాత్మక 2027 వన్డే ప్రపంచకప్ టోర్నమెంట్‌కు సంబంధించి ఐసీసీ ఒక కీలక అప్‌డేట్ ఇచ్చింది. ఈ టోర్నీకి అర్హత సాధించేందుకు నిర్వహించే క్వాలిఫైయర్స్ మ్యాచ్‌ల తేదీలను ఐసీసీ అధికారికంగా ప్రకటించింది. 10 జట్లు పాల్గొనే ఈ క్వాలిఫైయర్ రౌండ్ 2027 ఫిబ్రవరి 22 నుంచి మార్చి 23 మధ్య జరగనుంది. అయితే ఈ మ్యాచ్‌లను ఏ దేశంలో లేదా ఏ వేదికల్లో నిర్వహిస్తారనే దానిపై ఐసీసీ ఇంకా ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు.ఈసారి జరగబోయే వన్డే ప్రపంచకప్‌ను ఐసీసీ సరికొత్త ఫార్మాట్‌లో నిర్వహించబోతోంది. ఈ మెగా టోర్నీలో మొత్తం 14 జట్లు పోటీపడనున్నాయి.